http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

శనివారం 4 జూలై 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో వ్యవసాయం ఒక పండుగలా మారింది
- రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి దిగుబడి నమోదైంది
- భారీ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశాం
- ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం తగ్గింది
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హుజుర్‌నగర్


ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. పంటల ఎంపికలో జాగ్రత్త వహించాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజుర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలలో ఆయన విస్తృతంగా పర్యటించారు. వివిధ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో వ్యవసాయం ఒక పండుగలా మారిందన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి దిగుబడి నమోదైందని, భారీ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఏడు రకాల సన్న వరిధాన్యాలకు బోనస్ కూడా కొనసాగుతోందని, ఈ చర్యల వల్ల రైతులకు మరింత మేలు - మిగతా3లో



## మోదీ 3 దేశాల టూర్ ఖరారు

- 40ఏళ్లలో తొలిసారి న్యూజిలాండ్‌లో పర్యటన
- జూలై 6 నుంచి 11 వరకు ప్రధాని మోదీ విదేశీ పర్యటన
- ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పర్యటించనున్న పీఎం
- దాదాపు 40 సంవత్సరాల తర్వాత ఒక భారత ప్రధాన మంత్రి న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం

## బుకాయింపులు, అసత్యాలతో మోసం ఎన్నాళ్లు?



### బీఆర్‌ఎస్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు

- రూ.8.21 లక్షల కోట్లు అప్పులు చేసింది మీరు కాదా?
- కేసీఆర్, హరీశ్‌రావులకు భట్టి కౌంటర్ ఎటాక్
- బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు రాష్ట్రానికి భారంగా మారాయన్న భట్టి విక్రమార్క
- చేసిన అప్పులను తక్కువ చేసి చూపించేందుకు కేటీఆర్, హరీశ్ ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్య
- బీఆర్‌ఎస్‌పై తీవ్ర విమర్శలు

హైదరాబాద్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాజీ మంత్రి హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము చేసిన అప్పులను, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ ప్రజా ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు. సింగరేణి సంస్థను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు సంక్షోభంలోకి నెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్‌ఎస్ నేతలు సింగరేణి ప్రాంతాల్లో తిరుగుతూ మళ్లీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లే అవకాశం లేదని చెప్తూనే గతంలో - మిగతా3లో



## వారసత్వ సంపద మీ సొత్తు కాదు

- పాకిస్థాన్‌పై భారత్ ఘాటు వ్యాఖ్యలు
- తక్షశిలలో పాకిస్థాన్ చేపట్టిన పునర్నిర్మాణ పనులపై తీవ్ర వివాదం
- నిబంధనలకు విరుద్ధంగా పనులు ఆపకపోతే ప్రమాద జాబితాలో చేర్చుతామని యునెస్కో హెచ్చరిక
- వారసత్వ సంపద ప్రపంచానిదని, ఏ ఒక్క దేశానిది కాదని స్పష్టం చేసిన భారత్
- తక్షశిలను ప్రపంచ వారసత్వ జాబితా నుంచి తొలగిస్తామని కూడా హెచ్చరించిన యునెస్కో



## ఉగ్రవాద నిర్మూలనకు ప్రపంచ దేశాలు సహకరించాలి

- ఉగ్రవాదానికి మద్దతు ఆపితేనే సింధు జలాల ఒప్పందం పునరుద్ధరణ: భారత్
- సింధు జలాల ఒప్పందంపై భారత్ కీలక వ్యాఖ్యలు
- ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు పూర్తిగా, శాశ్వతంగా వీడే వరకు ఒప్పందం ఉండదని స్పష్టం
- అఫ్గానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడుల్ని కూడా ఖండించిన ప్రభుత్వం



## పాకిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం

- పాకిస్థాన్‌లో లోయలో పడిపోయిన ప్రయాణికుల బస్సు
- ప్రమాదంలో కనీసం 40 మంది మృతి, 8 మందికి గాయాలు
- బ్రేకులు ఫెయిల్ కావడం, అధిక ప్రయాణికులే కారణం!

## సందిగ్ధంలో అన్నదాతలు

### రెగ్యులర్ పంటలా - ఆరుతడి పంటలా?

- ఎటూ తేల్చుకోలేని స్థితిలో అన్నదాత
- ఖరీఫ్ సీజన్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్న ఎల్‌నినో
- వర్షాలు కురవకపోవడంతో వరి సాగుకు ఇబ్బందులు
- జిల్లాల్లో తగ్గిన వరి సాగు - వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతన్నలు



హైదరాబాద్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో జలాశయాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటు న్నాయి. ఏ పంటలు సాగుచేయాలో తెలియక రైతులు సతమతం అవుతున్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ప్రభుత్వం సూచిస్తున్నా అన్నదాతలు మొగ్గు చూపడంలేదు. వరి పండే నేలల్లో ఇతర పంటలు సాగయ్యే అవకాశం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు కోరుతున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో జిల్లాల్లో - మిగతా3లో



## తీరందాటిన నైరుతి రుతుపవనాలు

- దక్షిణాది రాష్ట్రాల్లో భారీగా వర్షాలు, వరదలు
- మత్స్యకారులకు ఐఎండీ హైఅలర్ట్?!
- నైరుతి రుతుపవనాలతో దేశవ్యాప్తంగా వర్షాలు
- పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలు రావచ్చని ఐఎండీ హెచ్చరిక

## రైతు భరోసా నిధుల విడుదలలో మరోసారి రేవంత్ ప్రభుత్వం రికార్డు

- కేవలం 4 రోజులలోనే రైతుభరోసా పథకం కింద 6590.37 కోట్లు రైతు ఖాతాలలో జమ
- ఈ రోజు 4 నుండి 5 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు రైతుభరోసా నిధుల విడుదల
- నాలుగో విడతలో 4.41 లక్షల మంది రైతుల ఖాతాలలో 1188 కోట్లు జమ
- ఇప్పటివరకు మొత్తం 65.76 లక్షల మంది రైతులకు రూ.6590.37 కోట్ల రైతుభరోసా సాయం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్

రైతుభరోసా నిధులను రైతు ఖాతాలలో వేయడంలో రేవంత్ సర్కార్ మరోసారి రికార్డు సృష్టించామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జూన్ 30 న రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమం మొదలుపెట్టిన కేవలం 4 రోజులలోనే రైతు భరోసా పథకం కింద 6590.37 కోట్లను రైతుల ఖాతాలలో జమ చేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా పథకం కింద ఈ రోజు నాలుగో విడతలో 4 నుండి 5 ఎకరాలకు వరకు సాగుభూమి కలిగిన రైతుల ఖాతాల్లో నేడు రూ. 1188 కోట్లను నేరుగా జమ చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. - మిగతా3లో

# మోదీ 3 దేశాల టూర్ ఖరారు



ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటించను న్నారు. ఈ 3 దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా మోదీ ఈ పర్యటన చేయనున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శుక్రవారం వెల్లడించింది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ మొదట ఇండోనేషియాను సందర్శిస్తారు. ఆ తర్వాత ఆస్ట్రేలియాకు ప్రయాణమవుతారు. అక్కడ ఆయన ప్రధాన అధికారిక కార్యక్రమాలు మెల్‌బోర్న్‌లో జరుగుతాయి. అనంతరం న్యూజిలాండ్‌కు వెళ్లి తన పర్యటనను ముగిస్తారని ఎంఈఏ కార్యదర్శి (ఈస్ట్) రుద్రేంద్ర టాండన్ తెలిపారు.

### 40 ఏళ్లలో మొదటిసారి

ప్రధాని మోదీ న్యూజిలాండ్ పర్యటన ఎంతో ప్రత్యేకమైనది. దాదాపు 40 సంవత్సరాల తర్వాత ఒక భారత ప్రధాన మంత్రి ఆ దేశంలో పర్యటించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వచ్చేవారం ప్రధాని మోదీ న్యూజిలాండ్‌లో తన మొదటి అధికారిక పర్యటన చేయనున్నట్లు ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ ఈ రోజు ఉదయం అధికారికంగా ప్రకటించారు. "భారత ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే వారం న్యూజిలాండ్‌లో తన మొదటి అధికారిక పర్యటన చేయనున్నారని ప్రకటించడానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను" అని లక్సన్ తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయితే ఈ పర్యటన గురించి కచ్చితమైన తేదీలను ఆయన వెల్లడించలేదు. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం ఒకటి అని కొనియాడిన లక్సన్, న్యూజిలాండ్ ఆర్థిక శ్రేయస్సుకు భారత్ ఎంతో కీలకమైనదని స్పష్టం చేశారు. "ఏప్రిల్‌లో కుదిరిన 'న్యూజిలాండ్-ఇండియా ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్' (ఎఫ్‌టీఏ) ద్వారా ఇరుదేశాల మధ్య సంబంధాలను మేము తదుపరి స్థాయికి తీసుకెళ్తున్నాం. ఇది న్యూజిలాండ్?కు మరిన్ని ఉద్యోగాలను, అధిక ఎగుమతులను, బలమైన ఆర్థిక వృద్ధిని అందిస్తుంది" అని పేర్కొన్నారు. ఈ ఒప్పందం కొత్త అవకాశాలను తెరుస్తుందని, న్యూజిలాండ్ వస్తు, సేవలకు 1.4 బిలియన్ల (140 కోట్ల) జనాభా కలిగిన భారీ మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తుందని లక్సన్ అన్నారు. ఇది కివి (న్యూజిలాండ్) సమాజంలోకి మరింత ఆదాయాన్ని తీసుకువస్తుందని చెప్పారు. అంతేకాదు ఉద్యోగాలను సృష్టిస్తుందని, వేతనాలను పెంచుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, న్యూజిలాండ్‌ల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించడానికి, పెట్టుబడులను ప్రోత్సహించడానికి ఈ సంవత్సరం ప్రారంభంలోనే భారత్?, న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకాలు చేశాయి.

### ఇండోనేషియా పర్యటన

నివేదికల ప్రకారం, భారతదేశంలో ప్రజల జీవితాలను, జీవనోపాధిని మార్చడంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) సాధించిన విజయాన్ని చూసి, ఆ రంగంలో భారత్‌తో భాగస్వామ్యం పట్ల ఇండోనేషియా చాలా ఆసక్తి కనబరుస్తోంది. ఇందులో భాగంగానే, 2026 జూన్ 7న దిల్లీలో 8వ ఇండియా-ఇండోనేషియా జాయింట్ కమిషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భారత విదేశాంగ మంత్రి (ఈఏఎం) ఎస్.జైశంకర్, ఇండోనేషియా విదేశాంగ మంత్రి సుగియోనో సంయుక్తంగా అధ్యక్షత వహించారు.

### ఆస్ట్రేలియా పర్యటన

ఇక మోదీ తన ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా, ఇరుదేశాల మధ్య ఉన్న సన్నిహిత వ్యూహాత్మక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఇటీవలే మే 26న దిల్లీలో జరిగిన 'ఫారిన్ మినిస్టర్స్? ఫ్రేమ్‌వర్క్ డైలాగ్' (ఎఫ్ఎంఎఫ్‌డీ) సందర్భంగా విదేశాంగ మంత్రి జైశంకర్ తన ఆస్ట్రేలియా కౌంటర్ పార్ట్ పెన్నీ వాంగ్‌తో సమావేశం కావడం గమనార్హం. ఈ పర్యటనలో అత్యంత ముఖ్యమైన ఘట్టంగా జులై 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరగనున్న 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' అనే భారీ కమ్యూనిటీ ఈవెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. ఆస్ట్రేలియా ఇండియా ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం, విక్టోరియా రాష్ట్ర చరిత్రలోనే భారత్-ఆస్ట్రేలియా కమ్యూనిటీల మధ్య జరిగిన అతిపెద్ద సమ్మేళనాలలో ఒకటిగా నిలవనుందని అంచనా.

# తీరందాటిన నైరుతి రుతుపవనాలు



నైరుతి రుతుపవనాలు పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలు తప్ప దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు విస్తరించాయి. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తాజా అల్పపీడన ప్రభావంతోపాటు, ఇతర వాతావరణ పరిస్థితుల వల్ల రానున్న వారం రోజుల్లో దేశవ్యాప్తంగా, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. సున్నితమైన ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడడం, ఉరుములతో కూడిన గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

### ఏపీ, తెలంగాణలో విస్తారంగా వర్షాలు

ఐఎండీ ప్రకారం, ప్రస్తుతం దక్షిణ భారతదేశంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కొనసాగుతున్నాయి. కేరళ, కర్ణాటక, తెలంగాణ, తీరప్రాంత ఆంధ్రప్రదేశ్?, తమిళనాడు, పుదుచ్చేరి, రాయలసీమ ప్రాంతాల్లో రానున్న వారం రోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. కేరళ, కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తాయి. తెలంగాణ, రాయలసీమలో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

### మత్స్యకారులకు హై అలర్ట్

బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో గంటకు 45-55 కి.మీ వేగంతో, గరిష్ఠంగా 65 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. అందువల్ల గుజరాత్, కొంకణ్, గోవా, కర్ణాటక, కేరళ, లక్షద్వీప్, ఒడిశా, బంగాల్, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని ఐఎండీ హెచ్చరించింది. తీరప్రాంత ప్రజలు అధికారుల హెచ్చరికలను నిరంతరం గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. ఈ వర్షాలు ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగించి వ్యవసాయ పనులకు ఊతం ఇచ్చినప్పటికీ, సున్నితమైన ప్రాంతాల్లో వరదలు, ప్రకృతి విపత్తులకు దారితీసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

### వరదలు వచ్చే ఛాన్స్?!

రానున్న రెండు మూడు రోజుల్లో రాజస్థాన్, గుజరాత్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ఉత్తర అరేబియా సముద్రంలోకి రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నాయని తెలిపింది. ఇక వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతం కావడం, చురుకైన రుతుపవన ద్రోణి, బహుళ చక్రవాత చలనాలు, పశ్చిమతీరం వెంబడి నిరంతర తీరప్రాంత ద్రోణి వల్ల దేశం మొత్తం వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ వర్షాలు నేలలోని తేమను పెంచి ఖరీఫ్? పంటల సాగుకు మేలు చేస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా కురిసే భారీ వర్షాల వల్ల వరదలు, కొండచరియలు విరిగిపడడం, పంటకు నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే భారీ వర్షాలు కురిసిన ప్రాంతాలు, ముఖ్యంగా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్?, పశ్చిమ కనుమల వంటి కొండ ప్రాంతాల్లో వరదలు, నీరు నిలిచిపోవడం, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ శాఖ మార్గదర్శకాలను పాటించాలని సూచించింది. పశ్చిమ భారతదేశంలో అంటే గుజరాత్?, కొంకణ్?, గోవా, మధ్య మహారాష్ట్ర, సౌరాష్ట్ర డ కచ్? ప్రాంతాల్లో జులై 3 నుంచి 5 మధ్య కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కనుక హఠాత్తుగా వరదలు వచ్చే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది.

### ఆరెంజ్ అలర్ట్ జారీ

దిల్లీ, పంజాబ్, హరియాణా, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్‌లో రానున్న కొద్ది రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 40-60 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీయవచ్చు. నైనిటాల్?, బాగేశ్వర్? వంటి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముంది. అందుకే ఉత్తరాఖండ్?కు ఆరెంజ్ అలర్ట్? జారీ చేశారు. ఇక మధ్యప్రదేశ్?, ఛత్తీస్?గఢ్?, విదర్భల్లో కూడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిచే అవకాశం ఉందని అంచనా. అందుకే లోతట్టు, వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బంగాల్, ఝార్ఖండ్, బిహార్, సిక్కిం, అసోం, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్?, మణిపూర్?, మిజోరం, త్రిపురల్లో కూడా విస్తారంగా, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయి. ఎక్కువ కాలం వర్షాలు కురిసే అవకాశం ఉంది కాబట్టి వరదలు రావడం, కొండచరియం విరిగిపడడం, రవాణాకు అంతరాయం కలగవచ్చని ఐఎండీ హెచ్చరించింది.

### వర్షాలు పడుతున్నా వేడి, ఉక్కపోత ఎందుకు?


నైరుతి రుతుపవనాలు దేశంలోని మెజారిటీ ప్రాంతాలకు చేరినప్పటికీ, అనేక ప్రాంతాల్లో ఇంకా వేడి, ఉక్కపోత ఉన్నాయి. పర్యావరణ శాస్త్రవేత్త హిష్మీ హుస్సేన్ ప్రకారం, కేవలం వర్షపాతం ఒక్కటే ఉష్ణోగ్రతలను తగ్గించదు. హ్యూమిడిటీ ప్రభావం కూడా ఉంటుంది. అందుకే కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత ఉంది. నైరుతి రుతుపవనాలు అరేబియా సముద్రం, బంగాళాఖాతం నుంచ తేమను మోసుకొస్తాయి. కొద్దిసేపు వర్షం కురిసిన తర్వాత మళ్లీ ఎండ రావడం వల్ల తడి నేల వేడెక్కి ఆవిరి శాతం పెరుగుతుంది. అదే సమయంలో, రాత్రిపూట మేఘావృతమైన వాతావరణం, భూమి ఉపరితలం వద్ద వేడిని అడ్డుకోవడం వల్ల ఉష్ణోగ్రతలు తగ్గవు. దీనివల్ల వాతావరణం మరింత ఉక్కపోతగా మారుతుంది. ఈ తేమతో కూడిన గాలి అల్పపీడనాలు, చక్రవాత చలనాలు లేదా తీవ్రమైన భూఉపరితల ఉష్ణోగ్రతల వంటి వాతావరణ వ్యవస్థల ద్వారా పైకి లేచినప్పుడు మాత్రమే వర్షం కురుస్తుంది. ఈ వ్యవస్థలు బలహీనంగా ఉన్నప్పుడు తేమతో కూడిన గాలి పైకి లేవకుండా ఉపరితలం వద్దే నిలిచిపోతుంది. ఫలితంగా వర్షాలు పడినా కూడా ఉక్కపోతగా ఉంటుంది.

## వారసత్వ సంపద మీ సొత్తు కాదు..



ప్రపంచ వారసత్వ ప్రదేశమైన తక్షశిలలోని రెండు చారిత్రక కట్టడాల వద్ద పాకిస్థాన్ చేపట్టిన పునర్నిర్మాణ పనులపై తీవ్ర దుమారం రేగింది. ఈ వ్యవహారంపై ఐక్యరాజ్యసమితి సాంస్కృతిక విభాగం (యునెస్కో) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, భారత్ కూడా ఘాటుగా స్పందించింది. ఈ అంశంపై న్యూఢిల్లీలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. వారసత్వ సంపద, ముఖ్యంగా యునెస్కో గుర్తించిన ప్రదేశాలు ఏ ఒక్క వ్యక్తికి లేదా దేశానికి చెందినవి కావని స్పష్టం చేశారు. "అవి మొత్తం ప్రపంచానికి చెందినవి. మన వారసత్వాన్ని కాపాడుకోవడం, పరిరక్షించడం అందరి సమిష్టి బాధ్యత" అని ఆయన అన్నారు. పురావస్తు కట్టడాల పరిరక్షణ నియమాలను పాకిస్థాన్ ఉల్లంఘిస్తోందన్న నివేదికలపై ఆయన ఈ విధంగా స్పందించారు. పాకిస్థాన్‌లోని ప్రముఖ పత్రిక 'డాన్' కథనం ప్రకారం, తక్షశిలలోని కట్టడాల సమగ్రతను దెబ్బతీసేలా ఉన్న పునర్నిర్మాణ పనులను వెంటనే వెనక్కి తీసుకోవాలని యునెస్కో పాక్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. లేనిపక్షంలో ఆ ప్రదేశాలను 'ప్రమాదకర జాబితా'లో చేర్చుతామని హెచ్చరించింది. అంతేకాకుండా, అనవసరమైన జోక్యం కారణంగా తక్షశిలను ప్రపంచ వారసత్వ జాబితా నుంచి తొలగించడానికి కూడా వెనుకాడబోమని యునెస్కో స్పష్టం చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తక్షశిలలోని మొహ్రా మొరాదు, సిర్కాప్‌లో పంజాబ్ పురావస్తు శాఖ చేపట్టిన పనులపై సమాచారం, చిత్రాలను మూడో పక్షం పారిస్‌లోని పాక్ శాశ్వత ప్రతినిధికి పంపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై జూన్ 12న యునెస్కో, పాక్ పురావస్తు శాఖ అధికారులు సంయుక్తంగా తక్షశిలను సందర్శించారు. నిర్మాణాలకు ముందు, తర్వాత తీసిన ఫొటోలు, వినియోగించిన మెటీరియల్‌పై ల్యాబ్ రిపోర్టులు సమర్పించాలని యునెస్కో కోరింది. ప్రపంచ వారసత్వ కట్టడాల పునరుద్ధరణలో సిమెంట్ వాడటం యునెస్కో నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని నిపుణులు చెబుతున్నారు. ఈ వివాదం కారణంగా ప్రపంచ వారసత్వ జాబితాలో మరో 24 ప్రదేశాలను చేర్చాలన్న పాకిస్థాన్ ప్రయత్నాలకు ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది.

## పాకిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం



పాకిస్థాన్‌లో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రయాణికులతో వెళుతున్న బస్సు అదుపుతప్పి లోతైన లోయలో పడిపోవడంతో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సుల సరిహద్దులోని షెరనీ జిల్లాలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న ఈ ప్రయాణికుల బస్సు, దానా సర్ ప్రాంతంలోని పర్వత రహదారిపై ప్రయాణిస్తుండగా ఉదయం 8 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. బస్సులో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం, బ్రేకులు విఫలం కావడం వల్లే ఈ ఘోరం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదకరమైన మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు ఒక్కసారిగా లోయలోకి దూసుకెళ్లింది. ప్రారంభంలో ఈ బస్సు 36 మంది ప్రయాణికులతో బయలుదేరినప్పటికీ, మార్గమధ్యంలో మొరాయించిన మరో వాహనంలోని ప్రయాణికులను కూడా ఎక్కించుకోవడంతో మొత్తం ప్రయాణికుల సంఖ్య 48కి చేరింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే '1122' అత్యవసర సిబ్బంది, స్థానిక అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని జోబ్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘోర ప్రమాదంపై బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్తీ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించగా, పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఉగ్రవాద నిర్మూలనకు ప్రపంచ దేశాలు సహకరించాలి

సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌పై భారత్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఉగ్రవాద కార్యకలాపాలకు శాశ్వతంగా మద్దతు నిలిపివేసే వరకు సింధు జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని భారత్ పునరుద్ఘాటించింది. అదే సమయంలో అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడుల్ని కూడా తీవ్రంగా ఖండించింది. ఆ దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళనకరం అని పేర్కొంది. దిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ విషయాల్ని వెల్లడించారు. సింధు జలాల ఒప్పందంపై భారత వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.
'పాకిస్థాన్ నిరంతరం సరిహద్దు దాటి ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోంది. అందుకే సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. పాకిస్థాన్ నమ్మదగిన రీతిలో, శాశ్వతంగా ఉగ్రవాదానికి మద్దతు పూర్తిగా విరమించుకోవాలి. అప్పటి వరకు మా వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదు' అని జైస్వాల్ తెలిపారు. ఇటీవల భారత్- జపాన్ ప్రధానుల సమావేశంలో కూడా ఉగ్రవాదంపై ఇరు దేశాలు ఒకే స్వరంతో స్పందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయే తకైచి సమావేశం అనంతరం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పాకిస్థాన్ నుంచి పుట్టుకొస్తున్న సరిహద్దు ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించారు.
ఆ ప్రకటనలో ఐక్యరాజ్యసమితి నిషేధిత ఉగ్రసంస్థలైన లష్కరే తోయిబా (ఎల్ఈటీ), జైషే మహ్మద్ (జేఈఎం), అల్ ఖైదా, ఐసిస్ వంటి సంస్థలపై ప్రపంచ దేశాలు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే స్థావరాల్ని పూర్తిగా నిర్మూలించడం, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చే వ్యవస్థల్ని ధ్వంసం చేయడం, సరిహద్దుల మీదుగా ఉగ్రవాదుల రాకపోకల్ని పూర్తిగా అడ్డుకోవాలని భారత్- జపాన్ పేర్కొన్నాయి.

### అఫ్గానిస్థాన్‌కు భారత్ సాయం

ఇదే సందర్భంగా అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ ఇటీవల జరిపిన వైమానిక దాడులపై కూడా భారత్ స్పందించింది. మహిళలు, చిన్నారులతో పాటు పలువురు అమాయక పౌరులు మరణించడం బాధాకరమని జైస్వాల్ తెలిపారు. 'పాకిస్థాన్ వైమానిక దాడుల్ని భారత్ తీవ్రంగా ఖండిస్తోంది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. అఫ్గానిస్థాన్ సమగ్రత, సార్వభౌమాధికారానికి భారత్ ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుంది' అని ఆయన పేర్కొన్నారు. అఫ్గానిస్థాన్ ప్రజలకు భారత్ అందిస్తున్న మానవతా సహాయం కొనసాగుతుందని కూడా ఆయన వెల్లడించారు.




మందులు, వైద్య సహాయం, అభివృద్ధి ప్రాజెక్టుల ద్వారా అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల పాకిస్థాన్ సైన్యం అఫ్గానిస్థాన్‌లోని పక్తియా, పక్తికా, కునార్ ప్రావిన్సులపై సరిహద్దు దాటి వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో భారీ ప్రాణనష్టం సంభవించినట్లు తాలిబాన్ నేతృత్వంలోని అఫ్గాన్ ప్రభుత్వం వెల్లడించింది. తాలిబాన్ ప్రభుత్వ డిప్యూటీ అధికార ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపిన వివరాల ప్రకారం, ఆ దాడుల్లో 36 మంది పౌరులు మరణించారు. ఇందులో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. మరో 163 మంది గాయపడ్డారు. 3 నివాస గృహాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని ఆయన వెల్లడించారు.

### పాకిస్థాన్ అక్కసు

మరోవైపు సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో ఉక్కిరిబిక్కిర వుతున్న పాకిస్థాన్ తమ అక్కసు వెళ్లగక్కుతోంది. పాక్‌కు కేటాయించిన నీటిని అడ్డుకునేందుకు లేదా నిలిపివేసేందుకు ఏమైనా ప్రయత్నం చేస్తే అది తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని పీపీపీ ఛైర్మన్ భిలావల్ భుట్టో ఇటీవల వ్యాఖ్యలు చేశారు. నీటిని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించొద్దని అన్నారు. భారత్ నిర్ణయాన్ని పాకిస్థాన్ ఏకపక్ష చర్య అని, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం అని వాదిస్తోంది. పరస్పర చర్యల ద్వారానే సమస్యల్ని పరిష్కరించుకోవాలని పాక్ నాయకులు అభ్యర్థిస్తున్నారు. మరోవైపు సింధు జలాల్లో పాకిస్థాన్ వాటా తీసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ దేశ మంత్రి ముసాదిక్ మాలిక్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ఎంఈఏ దీనిపై స్పందించింది.

# బుకాయింపులు, అసత్యాలతో మోసం ఎన్నాళ్లు?

-మొదటిపేజీ తరువాయి

జరిగిన బొగ్గు మాయం ఆరోపణలపై తాము సీరియస్‌గా ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు.

వివిధ మార్గాల ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని భట్టి విక్రమార్క అన్నారు. బుకాయింపులు, అసస్యలతో ఎన్నాళ్లు మోసం చేస్తారని మండిపడ్డారు. ఈ అప్పులపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని వెనక్కి తగ్గామని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక, వడ్డీతో కలిపి రూ.2.08 లక్షల కోట్లను చెల్లించామన్నారు. 10 వడ్డీకి కూడా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అప్పులు తెచ్చారన్నారు. వడ్డీల భారాన్ని తగ్గించేందుకు తాము అనేక చర్యలు చేపట్టినట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కట్టాల్సిన వడ్డీని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గించామన్నారు. రోడ్డుపై నిలబడి అడ్డగోలుగా రోజూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సింగరేణిపై బీఆర్ఎస్ నేతలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారన్నారు. సింగరేణి కోల్ బ్లాక్‌లను పెంచేందుకు చిన్న ప్రయత్నమైనా చేశారా అని భట్టి ప్రశ్నించారు.

**అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులను కేటీఆర్, హరీశ్‌రావులు తక్కువ చేసి చూపేందుకు ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. హరీశ్‌రావు మంత్రిగా చేశాననే విషయం మర్చిపోయి అనేక విషయాలపై అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు




సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. వారు చెప్పే అబద్ధాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు. నిశ్శబ్ధంగా ఉంటే వ్యవస్థలకు నష్టం చేసిన వాళ్లమవుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అబద్ధాల పునాదులపై పదేళ్లపాటు పాలన చేశారన్నారు. ఆ పార్టీ నేతలు కావాలని పదేపదే అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. ఆ పార్టీ వారు అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని భట్టి విక్రమార్క తెలిపారు. పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై కేసీఆర్ మాట్లాడాలని ఆయన సవాల్ విసిరారు. అప్పులు చేసి రాష్ట్రంపై పెనుభారం వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. "హాస్టల్ పిల్లలకు క్వాలిటీ వస్తువులు ఇవ్వాలనే టెండర్లు పిలిచాం. రూ.1,142 కోట్లకు టెండర్లు పిలిస్తే రూ.2 వేల కోట్ల అవినీతి అంటున్నారు. మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఏం మాట్లాడుతున్నారో తెలుస్తుందా. పదేళ్లపాటు దోపిడీ చేసింది ఎవరు కేసీఆర్ కాదా? రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేసీఆరే బయటకు వచ్చి మాట్లాడాలి. బాధ్యతగా పనిచేస్తున్న మంత్రులపై అభాండాలు సరికాదు. ఎవరి స్థాయి ఏమిటో వారు పోషించే పాత్రతో తెలుస్తుంది. మీరు చేసిన అప్పులు తీర్చేది కాళేశ్వరం కార్పొరేషనా, ప్రభుత్వమా. కీలక విషయాలపై కేసీఆర్ మాట్లాడాలి.. కేటీఆర్, హరీశ్‌రావు కాదు. మీరు చేసిన అప్పులు రాష్ట్రానికి పెనుభారంగా మారాయి"

**సింగరేణి బొగ్గు ఆరోపణలపై విచారణకు ఆదేశం**

సింగరేణికి నష్టం కలిగించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అనేక రకాలుగా ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. కోల్‌బ్లాక్‌లు తెచ్చుకునేందుకు కేంద్రంతో మాట్లాడుతున్నామన్న ఆయన సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లేందుకు అవకాశం లేదన్నారు. సింగరేణిపై కావాలనే బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణికి కొత్త బ్లాక్‌లు రాకుండా అడ్డుకున్నది కేటీఆర్, హరీశ్‌రావులేనని భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణిలో బొగ్గుమాయమైందని కేటీఆర్, హరీశ్‌రావులు చేసిన ఆరోపణలపై స్పందించిన భట్టి విక్రమార్క వాటిపై విచారించాలని ఆ సంస్థ విజిలెన్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు. సింగరేణికి నష్టం కలిగిస్తే నష్టపోతేది రాష్ట్రప్రజలేనని ఆయన తెలిపారు.

# రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

జరుగుతుందని చెప్పారు. అయితే ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం తగ్గిందని రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి హెచ్చరించారు.వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటికి అనుగుణంగా వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలు బలహీనపడ్డాయని, 2026 జూన్ నెలలో దేశవ్యాప్తంగా సాధారణంతో పోలిస్తే సుమారు 40 శాతం తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. ఇది ఇటీవలి సంవత్సరాల్లో అత్యంత పొడి జూన్ నెలల్లో ఒకటిగా నిలిచిందని చెప్పారు.

తెలంగాణలో కూడా జూన్ నెలలో సుమారు 22 శాతం తక్కువ వర్షపాతం నమోదవడంతో పలు ప్రాంతాల్లో విత్తనాల విత్తడం ఆలస్యమైందన్నారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ఎక్కువ భాగం మహారాష్ట్రలో ఉండటంతో అక్కడ కూడా వర్షాలు తక్కువగా కురవడం వల్ల తెలంగాణకు గోదావరి జలాల ప్రవాహం ఆలస్యమవుతోందని మంత్రి వివరించారు. నీటి లభ్యత అనిశ్చితంగా ఉన్న ప్రాంతాల్లో అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగలిగే, ఎండలను తట్టుకునే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రిజర్వాయర్లలో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగించాలని, ముందుగా తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు అనంతరం సాగునీటి అవసరాలను తీర్చేలా ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. వర్షపాతం తక్కువగా కొనసాగితే సమర్థవంతమైన నీటి నిర్వహణ ఎంతో కీలకమని చెప్పారు.వర్షపాతం, జలాశయాల్లో నీటి నిల్వలను



ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని, పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. పొడి వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని రైతులకు భరోసా ఇచ్చారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటూనే నీటి వినియోగంలో సమర్థవంతమైన విధానాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. సరైన ప్రణాళిక, రైతుల సహకారంతో ఎల్‌నినో సవాళ్లను అధిగమించి తెలంగాణ వ్యవసాయం అభివృద్ధి పథంలో కొనసాగుతుందనే విశ్వాసాన్ని మంత్రి వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా పర్యటనలో భాగంగా గడ్డిపల్లి గ్రామంలో రూ.250 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సమీకృత పాఠశాల (ఇంటిగ్రేటెడ్ స్కూల్) నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. హుజూర్‌నగర్ పట్టణంలో రూ.7.25 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం, రూ.4.50 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం పనులను ఆయన పరిశీలించారు. అలాగే చిలుకూరు--జెర్రిపోతులగూడ మధ్య నిర్మించిన బీటీ రహదారిని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు.

# డంపింగ్‌యార్డులా మారిన బుల్కాపూర్ నాలా

హైదరాబాద్ నగరంలో వానొస్తే వరద ఖాయం. కాలనీలు మునగడం ఖాయం ఇది అందరికీ తెలిసిందే. ఇందుకు కారణాలు మాత్రం అనేకం. నాలాల ఆక్రమణ, ప్రజలు బాధ్యతను మరిచి చెత్తను వేయడం, నిర్వహణ లోపాలు ఇలా పలు కారణాలు ఉన్నాయి. ఇలా వరద ముంపునకు నగరంలో ఏ ప్రాంతం కూడా అతీతం కాదు. అత్యంత ఖరీదైన ప్రాంతాల గుండా పయనించే అతిపెద్ద 'బుల్కాపూర్ నాలా' పరిస్థితి ఇప్పుడు అత్యంత దయనీయంగా మారింది. ఎంతంటే అది చూడగానే డంపింగ్ యార్డ్ అనే అనుమానం వస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ఈ కారణంగా కొన్నిచోట్ల 50 అడుగుల వెడల్పు ఉండాల్సిన నాలా పదోవంతు కంటే తక్కువకు క్షీణించింది.

**వరదనీరు వెళ్లేందుకు ఏకైక మార్గం**

హైటెక్ సిటీ పరిసరాలు హైదరాబాద్‌లో అత్యంత బిజీగా ఉండే ప్రాంతం. గండిపేట, కోకాపేట, మణికొండ, రాయదుర్గం, ఫిల్మ్‌నగర్, కృష్ణానగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ఈ ప్రాంతాల్లో వానపడితే వరద వెళ్లడానికి ఉన్న ఏకైక మార్గం బుల్కాపూర్ నాలా. ఎక్కడో శంకర్‌పల్లి మండలం బుల్కాపూర్ వద్ద ప్రారంభమయ్యే ఈ నాలా దాదాపు 44కిలోమీటర్లు ప్రవహించి హుస్సేన్ సాగర్‌లో కలుస్తుంది. బుల్కాపూర్ నాలా ప్రవహించే ప్రాంతాల్లో ఆక్రమణలు పెరిగిపోవడం, చెత్తాచెదారం పేరుకుపోవడం, రిటైనింగ్ వాల్స్ లేనందున చినుకు పడితే ప్రజలకు అష్టకష్టాలు తెచ్చి పెడుతున్నాయి. ప్రధానంగా నాలాల్లో పెరుకుపోయిన వ్యర్థాలు వరద నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. ఫలితంగా వరద నీరు సమీపంలోని నివాస ప్రాంతాలు, రహదారులు నీటమునుగుతున్నాయి.

**ఆక్రమణలతో తగ్గిపోయిన నాలా వెడల్పు**

బుల్కాపూర్ నుంచి కిందకి ప్రవహించే నాలా మోకిలాకు చేరుకుంటుంది. చుట్టుపక్కల గ్రామాలు మరుగు నీటి తరలింపునకు ఈ కాలువను వినియోగించుకుంటున్నారు.



నార్సింగి సమీపంలో నగరంలోకి ప్రవేశించే నాలా అక్కడి నుంచి ప్రముఖ, ఖరీదైన ప్రాంతాల గుండా ప్రవహిస్తుంది. ఖరీదైన ప్రాంతాలు కావడంతో నాలాకి ఇరువైపులా ఆక్రమణలు భారీగా పెరిగాయి. రాయదుర్గం, మణికొండ ప్రాంతాల్లో 50 అడుగుల వెడల్పు ఉండాల్సిన నాలా 10అడుగులకు తగ్గిపోయింది. బంజారాహిల్స్ సమీపంలోని సయ్యద్ నగర్‌లో నాలా వెడల్పు 3 అడుగులకు మించి లేదంటే ఆక్రమణలు ఎంతలా సాగాయో అర్థం చేసుకోవచ్చు. సమీపంలో నివాసభవనాలు నిర్మాణాలు జరగడం, వాటి వ్యర్థాలను నాలాలో వేయడం వంటి చర్యలతో కాలువ పూర్తిగా చెత్తతో నిండిపోయింది.

**నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు**

బంజారాహిల్స్, అహ్మద్‌నగర్ ఫస్ట్ లాన్సర్ వద్ద దాదాపు 200అడుగుల మేర చెత్తాచెదారం విపరీతంగా పేరుకుపోయింది. పైభాగం నుంచి వచ్చే నీటి ప్రవాహంలో కొట్టుకొచ్చిన ప్రతివస్తువు ఇక్కడ ఆగిపోయి నీటి ప్రవాహనికి అడ్డంకి మారాయి. చెత్తచెదారంతో నిండిపోయిన నాలా డంపింగ్ యార్డ్‌లా కనిపిస్తుంది. ప్లాస్టిక్ వస్తువులు, బాటిళ్లు, గ్లాసులు, వైర్లు, చీపుర్లు,మాస్కులు, పరుపులు, దిండ్లు, దుప్పట్లు, హెల్మెట్లు, మద్యం బాటిళ్లు ద్విచక్ర వాహనాల విడిభాగాలు సహా ఎన్నో రకాల వ్యర్థాలు నాలాలో పేరుకుపోయాయి.

ఖైరతాబాద్ కూడలిని ఆనుకొని ఉన్న నాలా పైవంతెన వద్ద టన్నుల కొద్ది వ్యర్థాలు పేరుకుపోయాయి. దీన్ని గమనించిన హైడ్రా నెల రోజుల కిందే పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జేసీబీ సాయంతో తొలగించి తరలించింది. ఐనా మళ్లీ వ్యర్థాలు వచ్చి చేరాయి. ఈ చెత్తను ఇలాగే వదిలేస్తే వర్షకాలం నేపథ్యంలో వాహన రాకపోకలకు అవాంతరం కలుగుతుందని భావించిన హైడ్రా మళ్లీ తొలగింపు ప్రక్రియ చేపట్టింది. 3రోజుల పాటు జరిగిన తొలగింపులో10 ట్రాక్టర్ల మేర వ్యర్థాలు తరలించినట్లు జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెబుతున్నారు. "ఖైరతాబాద్ నాలాలో చింతల్ బస్తీ, మాసాబ్ ట్యాంక్ పరిసరాల నుంచి చెత్త వచ్చి చేరుతోంది. ఈ చెత్తలో సోఫాలు, చాపలు, థర్మాకోల్, సీసాలు వంటివి ఉన్నాయి. ఇక్కడ రెండు రోజులుగా చెత్త తొలగించే పనులు జరుగుతున్నాయి. ఇప్పటికైతే కొంచెం కొంచెం క్లియర్ అవుతోంది. మొత్తం 9 ట్రాక్టర్ల చెత్తను తొలగించాం. ముందస్తు జాగ్రత్తగా అధికారులు ఇనుప జాలీలు ఏర్పాటు చేశారు. అయినా కొంతమంది ఇళ్లలో ఉండే చెత్తను నాలాలో వేస్తున్నారు. ఇప్పుడు వర్షాకాలం వస్తున్నందున మాకు చాలా ఇబ్బందిగా ఉంటుంది"-జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెత్త పేరుకుపోవడం, వెడల్పు తగ్గడం, భవన వ్యర్థాలు కలవడం రిటైనింగ్ వాల్ లేకపోవడం వంటి సమస్యలతో నాలా ప్రవాహం ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యంగా నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపునకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా ఫలితం లేకుండా పోతుంది.


## రైతు భరోసా నిధుల విడుదలలో మరోసారి రేవంత్ ప్రభుత్వం రికార్డు

-మొదటిపేజీ తరువాయి

ఈ విడతలో 4.41 లక్షల మంది రైతులు రైతుభరోసా సాయాన్ని పొందారని మంత్రి తెలిపారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ఇప్పటికే మొదటి మూడు విడతలలో 4 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు నిధులు విడుదల చేయగా, ఈ రోజు 4 నుండి 5 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులందరికీ రైతుభరోసా సాయం అందించమన్నారు. ఇప్పటివరకు రైతుభరోసా పథకం కింద మొత్తం 65.76 లక్షల మంది రైతుల ఖాతాలకు రూ.5402.37 కోట్ల సహాయాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.

## సందిగ్ధంలో అన్నదాతలు





-మొదటిపేజీ తరువాయి

వానాకాలం సాగు సందిగ్ధంలో పడింది. కనీసం పది శాతం వరకు కూడా విత్తనాలు పడలేదు. జలాశయాల్లో నీటినిల్వలు సరిపడా లేకపోవడంతో వరిసాగుకు నీరందే పరిస్థితి లేదు. బావులు, బోరుబావుల్లో నీరు అంతంత మాత్రమే ఉండటంతో పంటలు వేయాలా వద్దా అని అన్నదాతలు సందిగ్ధంలో ఉన్నారు. ఇప్పటికే వరినార్లు పోసి, పత్తి విత్తనాలు నాటినా వర్షాలు లేక ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. "ప్రభుత్వం సన్నరకాల ధాన్యాలు సాగు చేయాలని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని చెబుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో సాధ్యం కావట్లేదు. అధికారులు సన్నాలు వేయమని చెప్పారు. ఇప్పటికే సమయం అయిపోయింది. ఇప్పుడు విత్తనాలు నాటితే పంటపై ప్రభావం పడుతుంది. వర్షాభావ పరిస్థితుల వల్ల నీరు కూడా లేవు. వరి బదులుగా ప్రత్యామ్నాయ పంటలకు మళ్లాలని అధికారులు చెబుతున్నారు. వర్షాలు ఎక్కువైనట్లయితే ప్రత్యామ్నాయ పంటలకు అనుకూలంగా ఉండదు. సన్నవడ్లపై రూ.500 అదనంగా ఇస్తామని చెబుతున్నారు. అవి మాకు ఎంతమాత్రం గిట్టుబాటు కావడం లేదు. ఈ సన్నరకాల్లో 15 క్వింటాళ్ల కంటే అధిక దిగుబడి రావట్లేదు"

**అరుతడి పంటలే మేలు**

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు వేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నా రైతుల్లో స్పందన లేదు. వరిసాగుచేసిన భూముల్లో ముఖ్యంగా నల్లరేగడి నేలలో ఇతర పంటల సాగుకు యోగ్యంకాదని రైతులు చెబుతున్నారు. సన్నరకాల వరి పండించేందుకు కర్షకులు మొగ్గు చూపుతున్నారు. వరి తర్వాత అధికంగా పత్తిని రైతులు సాగుచేసేవారు. రెండు లక్షల సాధారణ సాగు విస్తీర్ణానికి ప్రస్తుతం లక్షఎకరాల్లో వేశారు. భవిష్యత్‌లో వర్షభావ పరిస్థితులు తీవ్రమైతే రైతులు నష్టపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. "వర్షాభావ పరిస్థితుల వల్ల వరి పంటకు బదులుగా పప్పుదినులు, జొన్న, రాగి, సజ్జ లాంటి పంటలు సాగు చేయాల్సిందిగా రైతులకు సూచించాం. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న డబ్ల్యూజీఎల్44, కేఎన్ఎం 7715, తెలంగాణ సోనా లాంటి విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగింది. నారు పోసుకునే రైతులు ముఖ్యంగా స్వల్పకాలిక సన్నరకాల వరి విత్తనాలను మాత్రమే సాగు చేయాలని సూచిస్తున్నాం" స్వల్పకాలిక పంటలపై రైతులకు అవగాహన : స్వల్పకాలిక, ఆరుతడి పంటలపై రైతువేదికల ద్వారా అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నామని అధికారులు వివరించారు. ప్రభుత్వం సూచించినట్లుగా ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గుచూపితేనే ఎల్‌నినో ప్రభావం, నష్టాల నుంచి బయటపడే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## దేశంలో తొలిసారిగా ఈ-వేలంలో విమానాన్ని విక్రయించిన ఈడీ




దేశంలోనే మొదటిసారిగా, ఓ కేసులో జప్తు చేసిన విమానాన్ని అధికారులు వేలం వేశారు. హైదరాబాద్ జోనల్ కార్యాలయానికి చెందిన అధికారులు హాకర్ 800ఎ రకానికి చెందిన విమానాన్ని ఎంఎస్‌టీసీ సంస్థ ద్వారా రూ. 3 కోట్లకు బహిరంగ వేలంలో విక్రయించారు. విమానం విక్రయంతో వచ్చిన సొమ్మును ఈడీ బాధితులకు చెల్లించనుంది. ఫాల్కన్ స్కామ్‌లో నిందితులు దేశవ్యాప్తంగా 7056 మంది డిపాజిటర్ల నుంచి దాదాపు రూ.4215 కోట్లు సేకరించారు. మోసం వెలుగులోకి వచ్చేసరికి 4065 మంది డిపాజిటర్లు నుంచి దాదాపు రూ. 792 కోట్ల వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు.

**అసలేం జరిగిందంటే?**

హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మెసర్స్ క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ స్కీమ్ పేరుతో ఒక నకిలీ వ్యాపారాన్ని తెరపైకి తెచ్చింది. పెట్టుబడి పెడితే భారీగా లాభాలు ఇస్తామంటూ నమ్మించి, వేలాది మంది అమాయక పెట్టుబడిదారుల నుంచి కోట్లు రూపాయలను వసూలు చేసింది. తీరా చూస్తే, అక్కడ ఎలాంటి ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ వ్యాపారమూ జరగలేదని, అది కేవలం ఒక బోగస్ స్కీమ్ అని అధికారులు తెల్చారు. ఈ మోసంపై సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో, ఈడీ రంగంలోకి దిగి పీఎంఎల్ఏ చట్టం కింద మనీలాండరింగ్ దర్యాప్తును ప్రారంభించింది. ఈ స్కామ్‌కు సూత్రధారి అయిన ఫాల్కన్ గ్రూప్ సీఎండీ అమర్‌దీప్ కుమార్, క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సంస్థతో పాటు ఇతరులపై ఈడీ గట్టి నిఘా పెట్టింది. దర్యాప్తులో భాగంగా 2025, మార్చి 7న ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిందితుడికి చెందిన హాకర్ 800ఎ విమానాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సహ నిందితులైన సందీప్ కుమార్, శరద్ చంద్ర తోష్నివాల్, ఆర్యన్ సింగ్ ఛాబ్రా నిందితులను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. విమానాన్ని సీజ్ చేసిన తర్వాత, ఈడీ చట్టపరమైన అనుమతులను తీసుకుంది.

**ఈ వేలంలో రూ.3కోట్లు పలికిన విమానం**

గత ఏడాది ఆగస్టు 18 న విమానం జప్తును సమర్థిస్తూ పీఎంఎల్ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ ఈడీ దరఖాస్తును ధృవీకరించింది. 2025 సెప్టెంబర్ 29 న నిందితులపై ఈడీ ప్రత్యేక కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. 2025 నవంబర్ 20న జప్తు చేసిన ఆస్తులను విక్రయించేందుకు వీలు కల్పించే పీఎంఎల్ఏ రూల్స్ 2013 శిరూల్ 4(2)ఠి ప్రకారం విమానాన్ని వేలం వేసేందుకు అనుమతించాలని ఈడీ కోరగా, అడ్జుడికేటింగ్ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఈ అనుమతులతోనే చట్టపరమైన అన్ని అడ్డంకులను తొలగిన తర్వాత 2026 జూలై 1న రూ. 3 కోట్లకు విమానాన్ని వేలం వేశారు. అయితే కొనుగోలుదారు వివరాలు మాత్రం ఈడీ వెల్లడించలేదు.


# సంపాదకీయం

## పార్లమెంట్‌లో వ్యూహాత్మకంగా కార్యాచరణ

2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లుల ఆమోదింప జేసుకోవాలన్న కృతనిశ్చయంతో ఉంది కేంద్రం. రెండింటికి పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా?ప్రభుత్వం వ్యూహాత్మకంగా కార్యాచరణను సిద్ధం చేస్తోంది. వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును పునఃప్రవేశపెట్టేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తోంది. మహిళా కోటా విషయానికొస్తే.. 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం.. పునర్విభజన తర్వాతే 33 శాతం కోటా అమల్లోకి రావాలి. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లో కూడా వన్-థర్డ్ కోటాను మహిళలకు కేటాయించనున్నారు. దీంతో అదే దామాషాలో ఆయా వర్గాల మహిళలకూ లబ్ధి చేకూరుతున్నట్టే. 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల బిల్లుతో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు లభిస్తాయి. నియోజకవర్గాల పునర్విభజన కాకపోవడంతో ఈ చట్టం అమల్లోకి రాలేదు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందుగానే ఈ చట్టాన్ని అమలు చేయాలంటే మరో రాజ్యాంగ సవరణ తప్పనిసరి. చట్టం ఏర్పడిన తర్వాత వచ్చే మొదటి జనాభా లెక్కల సేకరణ అనంతరం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళలకు రిజర్వేషన్‌ను అమలుచేయాలని చట్టం నిర్దేశిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనకు అతీతంగా ఇది అమలు చేయాలంటే ఈ చట్టంలోని సెక్షన్ 5ని ప్రభుత్వం సవరించాల్సి ఉంటుంది. ఇది పార్లమెంట్ ఉభయ సభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది ఆమోదంతోనే చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని? రాజ్యాంగంలోని 368(2) అధికరణ నిర్దేశిస్తోంది.నియోజకవర్గాల పునర్విభజన జరగాలంటే పలు రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. అలా రాజ్యాంగ సవరణ కోసం ప్రవేశపెట్టే బిల్లులకు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ అవసరం. సభలో సభ్యుల హాజరు సగానికిపైగా ఉండాలి. హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ బిల్లుకు మద్దతు తెలుపాలి. అప్పుడే ఆ బిల్లు ఆమోదం పొందుతుంది. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 540 మంది ఎంపీలు సభకు హాజరైతే.. వారిలో 360 మంది తప్పనిసరిగా బిల్లుకు మద్దతు తెలపాలి. లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు రాజ్యసభ ముందుకు వస్తుంది. రాజ్యసభలో ప్రస్తుతం ఉన్న 244 మంది సభ్యులు సభకు హాజరైతే.. 163 మంది బిల్లుకు మద్దతు తెలపాలి. అప్పుడే ఆ బిల్లు రాష్ట్రపతి ఆమోదం అనంతరం చట్టంగా మారుతుంది. కానీ అధికార ఎన్డీయే కూటమికి ఉభయ సభల్లో ఇప్పుడు అంత బలం లేదు. అందుకే ఆ బలం కూడగట్టానికి రకరకాల రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు.ఏప్రిల్‌లో మహిళా రిజర్వేషన్ ప్యాకేజీలో భాగంగా వచ్చిన డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో 54 ఓట్ల తేడాతో ఆమోదం పొందలేదు. అయితే తాజా రాజకీయ పరిణామాల తరుణంలో అదే బిల్లు మళ్లీ ప్రవేశపెడితే ఆమోదం పొందే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం లోక్‌సభలో బలాబలాలు చూస్తే.. మొత్తం సభ్యుల సంఖ్య 543గా ఉంది. మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయి. అంటే ప్రస్తుత సభ్యుల సంఖ్య 540 మాత్రమే. మూడింట రెండొంతుల మెజార్టీ అంటే 360 మంది మద్దతు కావాలి. ఎన్డీఏకు ప్రస్తుతం 318 మంది సభ్యులున్నారు. ప్రతిపక్షానికి 184 మంది సభ్యుల బలం ఉంది. ఇతరులు 38 మంది ఉన్నారు. బడ్జెట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లుల ఓటింగ్ సమయంలో 528 మంది సభ్యులు హాజరయ్యారు. అప్పుడు బిల్లు ఆమోదానికి 352 ఓట్లు అవసరమయ్యాయి. ఎన్డీయే కు అనుకూలంగా 298 ఓట్లు మాత్రమే రావడంతో 54 ఓట్ల తేడాతో బిల్లు ఆగిపోయింది. కానీ అప్పటికి, ఇప్పటికి పరిస్థితులు మారిపోయాయి. ప్రస్తుతం టీఎంసీ రెబల్ ఎంపీలు 20 మంది, ఉద్ధవ్ థాక్రే శివసేన ఎంపీలు ఆరుగురు కలిపి ఎన్డీఏ ఖాతాలోకి 26 ఓట్లు అదనంగా వస్తాయని అంచనా. అప్పుడు లోక్‌సభలో ఎన్డీఏ బలం 318 నుంచి 344కు పెరుగుతుంది.స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కాంగ్రెస్‌తో విభేదాల తరుణంలో ఇండి కూటమికి దూరమైంది. ఇప్పటికే బీజేపీ డీఎంకేను ఎన్డీఏలోకి ఆహ్వానించిందనే ప్రచారం జరుగుతోంది. డీఎంకే ఎన్డీఏలో చేరకపోయినా.. లోక్‌సభలో ఎన్డీఏకు జై కొడితే.. ఆ పార్టీకి చెందిన 22 మంది ఎంపీల బలం కూడా జత కలుస్తుంది. అప్పుడు ఎన్డీఏ బలం ఏకంగా 344 నుంచి 366కు పెరుగుతుంది. ఇప్పటికే ఈ మేరకు స్టాలిన్ నుంచి హామీ ఉందని కూడా బీజేపీ వ్యూహాత్మకంగా ప్రచారం చేసుకుంటోంది. సరే ఇక్కడివరకు లోక్‌సభలో పరిస్థితి ఓకే. కానీ కీలకమైన రాజ్యసభ సంగతేంటి అనే ప్రశ్న వస్తుంది. రాజ్యసభలో రెండొంతుల మెజారిటీకి 164 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం ఎన్డీఏ దగ్గర 150 మంది సభ్యులు ఉన్నారు. ఇక్కడ కూడా డీఎంకేకు చెందిన 8 మంది సభ్యుల మద్దతు లభిస్తే సంఖ్య 158కు చేరుతుంది. అప్పుడు మరో ఆరుగురు సభ్యుల మద్దతు అవసరం అవుతుంది. అయితే వచ్చే సెషన్‌లో మహిళా, డీలిమిటేషన్ బిల్లులు వచ్చే సమయానికి.. ఏదో రకంగా ఈ బలం సమకూర్చుకోవచ్చనేది బీజేపీ ఆలోచనగా ఉంది. పైగా ఒక్కసారి బిల్లులు లోక్‌సభ ఆమోదం పొందితే.. రాజ్యసభలో అనుకోని విధంగా మద్దతు లభిస్తుందనే లెక్కలు కూడా లేకపోలేదు.ఇప్పటికే టీఎంసీ, శివసేన యూబీటీ నుంచి ఎంపీల్ని ఆకర్షించి మద్దతు కూడగట్టడంలో సఫలమైన బీజేపీ..ఇప్పుడు శరద్ పవార్ ఎన్సీపీ, నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్, పంజాబ్‌లో ఆప్ మీద కూడా కన్నేసినట్టు చెబుతున్నారు. త్వరలో ఈ ఆపరేషన్లు కూడా కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని చిన్న పార్టీలతో చర్చలు పూర్తయ్యాయని, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలయ్యాక విపక్షానికి మరిన్ని షాకులిచ్చే ఉద్దేశంతో బీజేపీ ఉందనే చర్చ జరుగుతోంది. ఏదే?నా ప్రస్తుతం హస్తిన వేదికగా రాజకీయ వ్యూహాలు జోరుగా సాగుతున్నాయి. నయానో భయానో ఎంపీల బలం పెంచుకోవటానికి బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. కుదిరితే రాష్ట్ర స్థాయి నేతలు, పార్టీ సీఎంలు, అవసరమైతే అగ్రనేతలే నేరుగా రంగంలోకి దిగి పని పూర్తిచేయాలనే కార్యాచరణ సిద్ధమైంది. అన్నింటికీ మించి డీలిమిటేషన్ బిల్లును తిప్పికొట్టామనే ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతున్న ప్రతిపక్ష కూటమిని నైతికంగా చావుదెబ్బ కొట్టాలనేది కాషాయ పార్టీ లక్ష్యంగా ఉంది. అందుకే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రాగానే రాజకీయ సమీకరణాలు మార్చే పని మొదలుపెట్టారనే అభిప్రాయాలు వస్తున్నాయి.లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కేంద్రం మరో ప్రతిపాదనను కూడా పరిశీలిస్తోంది. లోక్ సభ నియోజకవర్గాలను ప్రస్తుతం ఉన్న 543 నుంచి 824కి పెంచాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఇప్పటికే సూచన చేసింది. . అంటే ప్రతీ రాష్ట్రంలో ఉన్న సీట్లలో మరో యాభై శాతం పెంచే బదులుగా?మరో కొత్త ఫార్ములాతో ఈ మండలి ప్రతిపాదనలు ఉండడం ఆసక్తిని పెంచుతోంది. మూడో వంతు పార్లమెంట్ సీట్లను మాత్రమే పెంచాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సిఫార్సు చేసినట్లుగా తెలుస్తోంది. అంటే 170 పార్లమెంట్ నియోజకవర్గాలలోనే పునర్ విభజన ఉండనుంది. 59 పార్లమెంట్ నియోజకవర్గాలను రెండుగా విభజించాలని? మరో 111 సీట్లను మూడుగా చేయాలని మండలి సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. మరి ఇప్పుడు వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్ ముందుకొచ్చే బిల్లు ఇలాగే ఉంటుందా.. మరేదైనా మార్పు చేస్తారా అనేది చూడాల్సి ఉంది.మోడీ ప్రధాని అయ్యాక పార్లమెంట్‌లో ఏ బిల్లు ఆమోదం విషయంలోనూ ఎన్డీఏ సర్కారు ఇబ్బంది పడలేదు. అందుకే రెండు నెలల క్రితం మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులు వచ్చినప్పుడు కూడా సర్కారు పకడ్బందీ ప్లాన్‌తోనే వచ్చుంటుందనే చర్చ జరిగింది. కానీ అధికార పక్షానికి షాకిస్తూ ఒక్కతాటిపైకి వచ్చిన విపక్షం.. ఆ రెండు బిల్లుల్ని తిప్పికొట్టింది. దీంతో ఎక్కడైనా అతివిశ్వాసానికి పోయామా అని ఎన్డీఏలో అంతర్గత చర్చ జరిగింది. ఆ సందర్భంగా పార్లమెంట్‌లో అనుసరించిన వ్యూహం.. విపక్షాల్ని ఎందుకు ఒప్పించలేకపోయామనే ప్రశ్నలకు సమాధానాలపై సమీక్ష జరిగింది. అప్పుడు జరిగిన పొరపాట్లు మరోసారి జరగకుండా.. అన్ని జాగ్రత్తలు తీసుకుని.. ఇంకా చెప్పాలంటే ప్లాన్ బీ కూడా రెడీగా పెట్టుకుని మరీ ఈసారి కేంద్రం రంగంలోకి దిగుతోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.ఇక్కడ డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల మద్దతే అసలు ఉద్దేశం కాదు. ప్రధానంగా 2/3 వ వంతు మెజార్టీ కూడగట్టడమే అసలు లక్ష్యం. అప్పుడే ఈ బిల్లులతో పాటు భవిష్యత్తులో యూనిఫామ్ సివిల్ కోడ్ అయినా.. వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లులైనా సాఫీగా ఆమోదం పొందుతాయనేది బీజేపీ దూరాలోచనగా ఉంది. అందుకే ఈ లక్ష్యాన్ని తేలిగ్గా తీసుకోవటానికి కాషాయ పార్టీ సిద్ధంగా లేదు.

# రిటైర్డ్ ఉద్యోగుల జీవన భద్రతకు ముప్పు!

ప్రభుత్వ ఉద్యోగి తన జీవితకాల కష్టార్జితాన్ని, రెక్కల కష్టాన్ని నమ్ముకుని, భవిష్యత్తు అవసరాల కోసం దాచుకునే ప్రధాన వనరు -- రిటైర్మెంట్ బెనిఫిట్స్. పిల్లల చదువులు, కుమార్తెల పెండ్లిళ్లు, ఇల్లు కట్టుకోవడం లేదా అత్యవసర వైద్య ఖర్చుల కోసం వారు ఈ సొమ్మునే ఆశ్రయిస్తారు. అయితే, రాష్ట్రంలో దశాబ్దాల పాటు సేవలు అందించి, రిటైరైన ఉద్యోగులు తమ సొంత సొమ్మును కూడా సకాలంలో తీసుకోలేక తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు మూడేండ్లు కావస్తున్నా తమకు పూర్తి మొత్తంలో రావాల్సిన బకాయిలు అందక వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంతంగా జీవితాన్ని గడుపుదామనుకునే వారికి ప్రభుత్వ ఉదాసీనత వల్ల తీవ్ర అన్యాయం జరుగుతున్నది. ప్రభుత్వం నుంచి రావలసిన ప్రధాన బెనిఫిట్లు నిలిచిపోవడంతో వృద్ధాప్యంలోనూ ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితులు దాపురించాయి. 2024 ఏప్రిల్ నుంచి రిటైరైన సుమారు 10 వేల మందికి పైగా ఉద్యోగుల పెన్షన్ ప్రయోజనాలు పూర్తిగా నిలిచిపోయాయి. తీవ్ర ఒత్తిడి, కోర్టు కేసుల నేపథ్యంలో కొంతమంది ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్లలో కేవలం 30-50 శాతం మాత్రమే చెల్లించి, మిగిలిన మొత్తాన్ని సర్కార్ పెండింగ్‌లో పెట్టింది. అరకొర చెల్లింపుల వల్ల తమ అవసరాలు ఏమాత్రం తీరక రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కేవలం రిటైర్మెంట్ బెనిఫిట్స్ మాత్రమే కాకుండా, గతంలో రావాల్సిన ఇతర ఆర్థిక ప్రయోజనాలు కూడా వారికి నిలిచిపోయాయి. తాము ప్రతి నెలా జీతం నుంచి పొదుపు చేసుకున్న జీపీఎఫ్ నిధులను సైతం నిలిపివేయడం శోచనీయమని ఆవేదన చెందుతున్నారు. టీఎస్‌జీఎల్ఐ, (గ్రూప్ ఇన్సూరెన్స్, తెలంగాణ స్టేట్ ఇన్సూరెన్స్, జీఐఎస్ బకాయిలు కూడా సకాలంలో చెల్లించడం లేదు. గ్రాట్యుటీ క్రెడిట్ చేయకుండా కేవలం కమ్యూటేషన్ మాత్రమే వేయడంపై తీవ్ర చర్చ జరుగుతున్నది. వాస్తవానికి కమ్యూటేషన్ ఇచ్చిన మరుసటి నెల నుంచే పెన్షన్‌లో దాదాపు 40 శాతం వరకు రికవరీ జరుగుతుంది. గ్రాట్యుటీ రాకుండా పెన్షన్ మొత్తం తగ్గిపోవడంతో పెద్ద ఆర్థిక భారంగా మిగులుతున్నది.



ఎర్న్‌డ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జీవితాంతం దాచుకున్న 300 రోజుల సంపాదిత సెలవుల నగదు బిల్లులు కూడా చాలామందివి ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. పాత పీఆర్సీ బకాయిలు ఇప్పటికీ ఎంతోమందికి పూర్తి స్థాయిలో అందలేదు. గత రెండు నెలలుగా రిటైర్డ్ ఉద్యోగుల జీతాలు/పెన్షన్ల నుంచి ఈహెచ్ఎస్ పేరిట రికవరీ చేస్తున్నా, క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించే హెల్త్ కార్డ్స్ ఇప్పటికీ అందలేదు. దీనివల్ల వృద్ధాప్యంలో అత్యవసర వైద్య ఖర్చుల కోసం ఇతరులపై ఆధారపడాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ఆరు నెలల్లో అమలు చేస్తామన్న పీఆర్సీ, నెలలు గడుస్తున్నా కనీసం నివేదిక కూడా బయటకు రాకపోవడంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. 2024 జనవరి నుంచి రావలసిన సుమారు 6 డీఏ బకాయిల మంజూరులో తీవ్ర ఆలస్యమవుతున్నది. విశ్రాంత ఉద్యోగుల జీవితాలు రోడ్డున పడకుండా ఉండాలంటే..ఉద్యోగ విరమణ చేసిన నెలలోపే వారికి రావాల్సిన అన్ని ప్రయోజనాలను అందించాలి. ఇది వారి ప్రాథమిక హక్కుగా పరిగణించాలి. రిటైర్డ్ ఉద్యోగులు వృద్ధాప్యంలో గౌరవంగా, ఆర్థిక భద్రతతో జీవించేలా చూడటం ప్రభుత్వ కనీస బాధ్యత. వారి చట్టబద్ధమైన హక్కులను కాపాడటానికి, జీవితాంతం దాచుకున్న సొమ్మును సకాలంలో అందించడానికి వెంటనే స్పందించి, తగిన తక్షణ చర్యలు చేపట్టాలి. అత్యవసర అవసరాల కోసం తాత్కాలిక రుణాలు, జీపీఎఫ్ పాక్షిక ఉపసంహరణలకు తక్షణ అనుమతులు మంజూరు చేయాలి. జీపీఎఫ్ ఫైనల్ క్లోజర్ మొత్తంతో పాటు పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ, కమ్యూటేషన్, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ నిధులను యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రిటైర్డ్ ఉద్యోగుల జీవన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి.

# కొత్త అవతారంలో నరేగా!

ఎవరెన్ని అభ్యంతరాలు చెప్పినా నిరుడు డిసెంబర్‌లో పార్లమెంటు ఆమోదించిన వీబీ-- జీ రాం జీ చట్టం బుధవారం నుంచి అమల్లోకొచ్చింది. ఇది రద్దయిన ఉపాధి హామీ పథకం (నరేగా)కు సరికొత్త అవతారం. గత పథకంలోని 'హక్కుల ప్రాతిపదిక'ను మార్చొద్దనీ, రాష్ట్రాలపై ఆర్థిక భారం పడే విధానానికి స్వస్తిచెప్పి, గతంలో మాదిరే కేంద్రమే భరించాలని పౌరసమాజ కార్యకర్తలతోపాటు కొన్ని రాష్ట్రాలు కూడా కోరాయి. అయితే నరేగా కన్నా ఇదెన్నో రెట్లు మేలని కేంద్రం చెబుతోంది. గత పథకంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి వంద రోజుల పని దినాలకు అనుమతించగా, తాము మరో 25 రోజులు పెంచామని... కూలీల వేతనాలు పెరిగాయని, వారానికోసారి చెల్లింపులు, ఇతర సంస్కరణలు తీసుకురావటంతో అవినీతికి ఆస్కారం ఉండబోదని కేంద్రం చెబుతోంది. పాత పథకంలో ప్రతి 15 రోజులకొకసారి చెల్లించాలన్న నిబంధన ఉన్నా, బ్యాంకింగ్ సదుపాయాలు అంతంతమాత్రమే కావటంవల్ల నిరుపేద కుటుంబాలు నెలల తరబడి వేచిచూడాల్సివచ్చేది. ఈలోగా రోజులు గడవటానికి అధిక వడ్డీ రేట్లకు అప్పులు చేసే వారు. ఇప్పుడు వారానికొకసారి వేతనాలిస్తామంటున్నా ఈ లోటుపాట్లు సరిదిద్దకపోతే నిరుపయోగమే. గ్రామీణ కూలీలకు మరో 25 రోజులు పనిదొరకటం, అందువల్ల అదనపు ఆదాయం రావటం హర్షించదగ్గది. అయితే నరేగాకింద గ్రామాల్లో సంబంధిత పక్షాల సమావేశాల నిర్ణయాల ఆధారంగా చేయించాల్సిన పనులు ఖరారయ్యేవి. తాజా చట్టం ప్రకారం అలాంటి పనులేమిటో కేంద్రం 'వాస్తవ ప్రమాణాల' ఆధారంగా నిర్ణయిస్తుంది. దాని కయ్యే వ్యయాన్ని కూడా అంచనా వేస్తుంది. అందులో 40 శాతాన్ని రాష్ట్రం భరిస్తే, మిగి లిన 60 శాతం నిధులు కేంద్రంనుంచి వస్తాయి. చేయించాల్సిన పనులు, వాటి అంచనా వ్యయం ఆధారంగా వివిధ రాష్ట్రాలకు వేర్వేరు కేటాయింపులుంటాయి. కేంద్రం నిర్దేశించిన పనుల కన్నా అధికంగా చేయించదల్చుకుంటే అందుకయ్యే మొత్తం వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. పాత పథకంలో నిధుల దుర్వినియోగం మాట వాస్తవం. కనబడని మనుషుల పేర్లతో కైంకర్యం చేసిన ఉదంతాలు అనేకం బయటపడ్డాయి. అందుకే హిందీ రాష్ట్రాల్లో 'పిశాచ లబ్ధిదారుల'న్న పేరు కూడా వచ్చింది. అయితే ఇప్పుడున్న సాంకేతికత అప్పుడు లేదు.



మొత్తం కాగితాలపైనే వ్యవహారాలన్నీ నడిచేవి. ఆన్‌లైన్ వ్యవస్థలు, డిజిటల్ చెల్లింపులు వచ్చాక ఆ బెడద తగ్గింది. 'నరేగా'ను అవినీతి పేరుతో కొట్టిపారేయటం సరికాదు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 2006లో ప్రారంభమైన ఈ పథకం తొలి దశాబ్దకాలంలో దాదాపు కోటిన్నరమంది ప్రజలను దారిద్ర్యంనుంచి విముక్తుల్ని చేసింది. ఇది చిన్న విషయమేం కాదు. అలాగే సగటున మహిళలకు 50 శాతం పనులు దక్కేవి. ఈ పథకంవల్ల సాగు పనులకు కూలీల కొరత వస్తున్నదన్న ఫిర్యాదులు ఉండేవి. కానీ జాతీయ గణాంకాలు మాత్రం సాగు పనులు ముమ్మరంగా ఉండే సమయంలో 'నరేగా'కు డిమాండ్ తక్కువేనని చెబుతున్నాయి. కూలీలకు బేరమాడే శక్తి పెరిగిందనీ, వారి కూలీ రేట్లు పెరిగాయనీ అధ్యయనాలు సూచిస్తున్నాయి. ంకొత్త పథకంలో రాష్ట్రాలు కూడా వ్యయం భరించాల్సిరావటం ఒకరకంగా విషాదం. 'నిధులు నిండుకుంటే హక్కులు నీరసిస్తాయ'ని ఆర్థికవేత్తలు చెబుతుంటారు. ఈ పథ కానికి కేటాయింపుల కోసం రాష్ట్రాలు ముందుగా సంక్షేమ పథకాలకే... మహిళా సంక్షేమానికే కోత పెడతాయి. గతంలో నిధులు లేక కాదు... అమలుపై ఆసక్తి కొరవడి అత్యధిక పేదరికం ఉండే బిహార్, ఉత్తరప్రదేశ్‌లు అతి తక్కువ నిధులు వినియోగించాయని గణాంకాలు సూచిస్తున్నాయి. ఇప్పుడు నిధుల లేమితో చాలా రాష్ట్రాలు ఆ తోవన పోయినా ఆశ్చర్యం లేదు. మొన్న ఏప్రిల్ సమావేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, బిహార్‌లతోపాటు జార్ఖండ్, ఉత్తరాఖండ్, తెలంగాణలు నిధుల భారం మోపటాన్ని వ్యతి రేకించాయి. తాజాగా తమిళనాడు సీఎం విజయ్ కూడా గొంతుకలిపారు. ఆశ్చర్యకరంగా ఆంధ్రప్రదేశ్ మాత్రం నిమ్మకునీరెత్తినట్టు ఉండిపోయింది. ఎటూ సంక్షేమాన్ని అరకొరగా చేస్తున్నాం... దాన్ని మరింత కత్తిరిస్తే సరిపోతుందని సీఎం చంద్రబాబు నాయుడు అనుకుంటున్నట్టున్నారు. ఏదేమైనా ఆచరణలో వచ్చే సమస్యల్ని అధ్యయనం చేశాకైనా వీబీ-- జీ రాం జీ ని మెరుగుపరచటం మేలు.

# సొంత రాష్ట్రంలోనే పట్టు కోల్పయిన సంతోష్

**బెంగళూరు :** భారతీయ జనతా పార్టీ లో అత్యంత శక్తివంతమైన జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి నుండి బీఎల్ సంతోష్ ను తప్పించి, తిరిగి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కు పంపాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్ణయించారని ప్రచారం జరుగుతోంది. సుదీర్ఘ కాలంగా పార్టీ అంతర్గత చక్రం తిప్పిన సంతోష్, ఇటీవల కాలంలో మోదీ-షాల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారనే టాక్ బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా కీలక ఎన్నికల్లో ఆయన అనుసరించిన ఏకపక్ష వ్యూహాలు పార్టీకి భారీ నష్టాన్ని చేకూర్చడమే కాకుండా, శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీయడం వల్లే ఈ నిర్ణయమని అంటున్నారు.బీఎల్ సంతోష్‌పై మోదీ-షాలకు నమ్మకం సడలడానికి ప్రధాన కారణం ఆయన సొంత రాష్ట్రమైన కర్ణాటక. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బలమైన మాస్ లీడర్, లింగాయత్ దిగ్గజం బీఎస్ యడియూరప్ప ప్రభావాన్ని తగ్గించేందుకు సంతోష్ గట్టిగా ప్రయత్నించడం. టికెట్ల కేటాయింపులో యడియూరప్ప వర్గాన్ని పక్కనబెట్టి, కేవలం సిద్ధాంతాల ప్రాతిపదికన కొత్తవారికి సీట్లు ఇవ్వాలనే సంతోష్ పట్టుదల కారణంగా పార్టీ అక్కడ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. క్షేత్రస్థాయి రియాలిటీని కాదని, కేవలం తన ఇగో కోసమే సంతోష్ తీసుకున్న నిర్ణయాలు దక్షిణ భారతదేశంలో బీజేపీ ఏకైక కోటను కూల్చేశాయని, దీనిని మోదీ-షాలు ఇప్పటికీ క్షమించలేకపోతున్నారని అంటున్నారు.బీఎల్ సంతోష్ సంస్థాగత కార్యదర్శిగా ఉన్నప్పటికీ, మాతృ సంస్థ అయిన ఆరెస్సెస్‌కు, బీజేపీ అధినాయకత్వానికి మధ్య సరైన సఖ్యత ఏర్పాటు చేయలేకపోయారన్న విమర్శలు కూడా ఉన్నాయి. జాతీయ స్థాయిలో ఆరెస్సెస్ గ్రౌండ్ క్యాడర్‌తో సమన్వయం చేసుకోవడంలో ఆయన విఫలమయ్యారని, పైగా పార్టీలో తన పట్టును నిలుపుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని నివేదికలు చెబుతున్నాయి. దీనివల్ల గత సార్వత్రిక ఎన్నికల్లో చాలా చోట్ల ఆరెస్సెస్ కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయలేదు, ఫలితంగా బీజేపీ సొంతంగా మ్యాజిక్ ఫిగర్ సాధించలేక కూటమిపై ఆధారపడాల్సి వచ్చింది. ఈ తీవ్రమైన సమన్వయ లోపం నేరుగా ప్రధాని మోదీ గ్రాఫ్‌పైనే ప్రభావం చూపడంతో, ఆరెస్సెస్ అగ్రనాయకత్వం కూడా సంతోష్‌ను మార్చడమే శ్రేయస్కరమని ఢిల్లీ పెద్దలకు సూచించినట్లు టాక్.బీఎల్ సంతోష్ వర్కింగ్ స్టైల్ చాలా కఠినంగా, రాష్ట్ర స్థాయి నాయకులను అణచివేసేలా ఉంటుందనే ఫిర్యాదులు మోదీ, అమిత్ షాల వద్దకు వెల్లువలా చేరాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌ల నియామకాల్లో కానీ, స్థానిక వ్యూహాల అమలులో కానీ ఆయన స్థానిక నేతలకు కనీస ప్రాధాన్యత ఇవ్వలేదనే వాదన ఉంది. అధికారం కేంద్రీకృతం కావడం వల్ల కొత్త నాయకత్వం ఎదగకుండా పోతోందని అధిష్ఠానం గుర్తించింది. ప్రధాని మోదీ 3.0 హయాంలో పార్టీని మరింత ఆధునికంగా, అందరినీ కలుపుపోయేలా తీర్చిదిద్దే క్రమంలో.. వివాదాలకు కేంద్రబిందువుగా మారిన బీఎల్ సంతోష్ శకానికి స్వస్తి పలకడమే ఉత్తమమని మోదీ-షాల ద్వయం భావించి, ఆయనను సున్నితంగా సంఘ్‌కు పంపేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసిందని అంటున్నారు.

# ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు చంద్రయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయాన్ని గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా గోరటి అశోక్ కుమార్ ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వార్డు మెంబర్ గోరటి అశోక్ కుమార్ ఉప సర్పంచ్ శారదా బాలయ్య గౌడ్, వార్డు నెంబర్ ఆంచ కృష్ణ గౌడ్ టిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు అంజి మాస్టర్, తాండ్రసాయిబాబా,శ్రీను,అర్జున్, కొమ్ము భరత్, మధు, ఒగ్గు రాఘవేందర్ మరియు గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల ట్రస్టు ద్వారా నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత



**సిమెంట్ బస్తాలు అందజేసిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

అమనగల్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు గుర్రం గుట్టకి చెందిన బిట్టి యాదమ్మ తండ్రి పేరు ఎల్లయ్య, నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో వారి నిర్మించుకున్న ఇంటి నిర్మాణం ఆ సంపూర్తిగా మిగిలిపోవడం జరిగింది స్థానిక టిఆర్ఎస్ పార్టీ నాయకులు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ద్వారా రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ నీ సంప్రదించగా వెంటనే స్పందించి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సిమెంట్ ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు .ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగిళ్ల జగన్ తదితరులు పాల్గొన్నారు

## గ్రామపంచాయతీ పరిశుభ్రంగా ఉంచడంలో పరిశుద్ధ కార్మికుల పాత్ర చాల గొప్పది



**బట్టలు అందజేసిన సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలంలోని లింగరావుపల్లి గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేసిన సర్పంచ్ కాసు శ్రీనివాసరెడ్డి, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పరిశుద్ధ కార్మికుల పాత్ర ఎంతో గొప్పదని సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పాలకవర్గ సభ్యులతో కలిసి గ్రామపంచాయతీ సిబ్బంది కి కాకి బట్టలు అందిచడం జరిగింది అనంతరం సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ,ప్రతిరోజు తెల్లవారుజామునే గ్రామ విధులను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పరిశుద్ధ కార్మికులు ఎంతో కష్టపడుతున్నారని కొనియాడారు. వారి శ్రమ వల్లే గ్రామం శుభ్రంగా ఉండగలు గుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామాన్ని శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని ఆయన కోరారుఈ కార్యక్రమంలో,సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి ఉప సర్పంచ్ బూత్కూరి వెంకటరెడ్డి గారు పంచాయతీ కార్యదర్శి మహేష్ వార్డు సభ్యులు భాగ్య శ్రీజ సురేందర్ రెడ్డి శేఖర్ జంగయ్య రబ్బానీ గ్రామ సిబ్బంది పాల్గొనడం జరిగింది

## ఈనెల 10 న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

**విద్యాసంస్థలను ముట్టడించిన వామపక్ష విద్యార్థి సంఘ నేతలు**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ , పి డి ఎస్ యు ఆధ్వర్యంలో విద్యార్థులను కలిసి జూలై 10న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల లేమి, స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడీ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు, విద్యార్థుల సర్టిఫికెట్ల నిలుపుదల వంటి సమస్యలు విద్యార్థులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యలపై స్పందించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థలను ముట్టడించడం జరిగింది అని వారు అన్నారు.




## ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేసిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డినీ మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుశీకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలకొండపల్లిలో రేపటి నుండి జూలై 4 శనివారం ప్రారంభంకానున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించాలని వినయపూర్వకంగా ఆహ్వానించారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడే ఈ సేవా కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో,మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్,మాజీ పి.సి.సి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, డి.సి.సి జిల్లా ఉపాధ్యకులు భూపతి రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యకులు విజయ్ కుమార్ రెడ్డి, యాట నరసింహ,పట్టణ అధ్యకులు రాహుల్,సీనియర్ నాయకు సురభి వెంకటేశ్వర్ రావు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్య మంత్రి పర్యటనకు పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు పూర్తి,

**పర్యవేక్షించిన కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్, సంగ్రాం సింగ్ పాటిల్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ముఖ్యమంత్రి భద్రతా బృందంతో కలిసి ఏఎస్ఎల్ నిర్వహణ ట్రాఫిక్, భద్రత, పార్కింగ్, వైద్య సేవలపై సమగ్ర సమీక్ష,అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉర్కొండపేట శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకోవడంతో పాటు ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ముఖ్యమంత్రి భద్రతా విభాగం ఉన్నతాధికారులు, ఇంటెలిజెన్స్ అధికారులు, జిల్లా స్థాయి అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెలిప్యాడ్, ఆలయ ప్రాంగణం, ముఖ్యమంత్రి సభా వేదిక, ప్రజల రాకపోకల మార్గాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు, కాన్వాయ్ ప్రయాణ మార్గం, భద్రతా పాయింట్లను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.అనంతరం ముఖ్యమంత్రి భద్రతా విభాగం ఆధ్వర్యంలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ ఏఎస్ఎల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని శాఖల వారీగా సమీక్షించారు. ముఖ్యమంత్రి ప్రయాణ మార్గం నుంచి కార్యక్రమం ముగిసే వరకు అమలు చేయాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, అత్యవసర సేవలు, వైద్య బృందాల మోహరింపు, అగ్నిమాపక సన్నద్ధత, విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుద్ధ్యం, కమ్యూనికేషన్ వ్యవస్థ, ప్రజా రద్దీ నియంత్రణ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి శాఖకు బాధ్యతలు అప్పగించామని, భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావులేదని, ప్రతి అధికారి తన బాధ్యతను పూర్తి స్థాయిలో నిర్వర్తించాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని, చిన్నచిన్న అంశాలను కూడా విస్మరించకుండా పర్యవేక్షించాలని సూచించారు.జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ బందోబస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాన్వాయ్ ప్రయాణించే మార్గమంతా పటిష్ట భద్రత కల్పించడంతో పాటు ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను మోహరించినట్లు వివరించారు.ముఖ్యమంత్రి భద్రతా విభాగం తరఫున అదనపు ఎస్పీ చి. వాసుదేవ రెడ్డి, డీఎస్పీలు ఎ. శ్రీధర్ రెడ్డి, డి. కృష్ణ ఏఎస్ఎల్‌లో పాల్గొని స్థానిక యంత్రాంగంతో కలిసి భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ప్రణాళికను అమలు చేసే విధానంపై సంబంధిత అధికారులకు పలు సూచనలు అందించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అరుణా రెడ్డి, దేవ సహాయం, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, విద్యుత్, పంచాయతీరాజ్, రోడ్లు–భవనాలు, ఆర్ అండ్ బీ, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు, ఆలయ ఈవోతో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల లీస్ట్ అధికారికంగా ప్రకటించలేదు

**త్వరలో పిసిసి ద్వారా నూతన కమిటీ విడుదల**

**ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యట నరసింహ**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

జూలై మూడో తేదీ టిపిసిసి అధ్యక్షుని పేరుపైన వెలువడిన మండల,టౌన్ అధ్యక్షుల జాబితా ఒక ఎస్ ఐ ఆర్ పైన సమీక్షించుకోవడానికి మాత్రమే అని ఇది మండల, టౌన్ అధ్యక్షుల ఆర్డర్ కాపీ కాదని ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యట నరసింహ అన్నారు కాంగ్రెస్ పార్టీ తరఫున కొద్ది రోజుల్లోనే ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ శ్రేణులతో మాట్లాడి సూచించిన అభ్యర్థుల పేర్లు మండల పార్టీ అధ్యక్షులుగా, టౌన్ పార్టీ అధ్యక్షులుగా టీపీసీసీ అధ్యక్షులు డిసిసి అధ్యక్షులతో కలిసి నిర్ణయిస్తారని తద్వారా టిపిసిసి ద్వారా ఆర్డర్ కాపీ వస్తుందని తెలుపుతున్నాము ఇది వచ్చింది ఒక ఎస్ ఐ ఆర్ పై సమీక్షించడానికి ప్రజలతో మమేకమై వారికి అవగాహన కల్పించడానికి వచ్చిన లిస్టు మాత్రమేనని ఎస్ఐ ఆర్ భాద్యతలు అప్పగించడం జరిగింది అని మీకు తెలియజేస్తున్నాను అని అందరూ గమనించగలరని ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

## నేడు కల్వకుర్తి నియోజక వర్గంలో సుశీకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పర్యటన



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

నేడు కల్వకుర్తి నియోజక వర్గంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ క్రింది కార్యక్రమాలలో పాల్గొననున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు అనంతరం తలకొండపల్లి మండల మరియు పరిసర గ్రామాల ప్రజల కొరకై ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న.సుంకిరెడ్డి మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారు.అనంతరం ఆమనగల్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శంకర్ కొండ తండా సర్పంచ్ మండ్లి రాములు కుమార్తె,కుమారుడి నూతన వస్త్రాలంకరణ మహోత్సవశీ బి ఎన్ ఆర్ ఫంక్షన్ హాల్ మిఠాయిపల్లిలో ఉదయం 10 గంటలకు పాల్గొననున్నారు. కార్యక్రమానికి హాజరుకానున్నారు, కావున ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు,స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకాగలరని కోరారు..

## తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా కాసు శ్రీనివాస్ రెడ్డి



**అభినందించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి మండల నూతన అధ్యక్షుడిగా మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అధ్యక్షుడిగా తనను నియమించిన పార్టీ అధిష్టానానికి, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి,ఎంపీ మల్లు రవి కి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తూ, మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

## 10వ వార్డులో విద్యుత్ షాక్ తో ఓ ఇంటిలో చెలరేగిన మంటలు..

**తక్షణమే స్పందించి మంటలను ఆర్పించిన కౌన్సిలర్ షేక్ ఏజాస్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో శుక్రవారం అకస్మాత్తుగా విద్యుత్ షాక్ సర్క్యూట్ తో ఓ ఇంటిలో మంటలు చెలరేగాయి.విషయం తెలుసుకున్న మున్సిపాలిటీ 10వ వార్డు స్థానిక కౌన్సిలర్ షేక్ ఏజాస్ తక్షణమే స్పందించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.అగ్నిమాపక సిబ్బంది షాక్ సర్క్యూట్ కు గురైన ఇంటి వద్దకు చేరుకొని మంటలను ఆర్పారు.షాక్ సర్క్యూట్ చోటు చేసుకుందని సమాచారం అందించిన వెంటనే సకాలంలో స్పందించిన కౌన్సిలర్ షేక్ ఏజాస్ తో పాటు అగ్నిమాపక సిబ్బందికి 10వ వార్డు ప్రజలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



http://www.agnidharanews.com
అగ్నిధార

# కల్వకుర్తి ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి

**కల్వకుర్తి జేఏసి చైర్మన్ డాక్టర్ అయిల్ సదానందం గౌడు**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి నియోజకవర్గాన్ని 15 మండలాలతో కూడిన జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమనేత ,కల్వకుర్తి జేఏసీ చైర్మన్ డాక్టర్ అయిల్ సదానందం గౌడు రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి

ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.భిన్న మతాలకు, విభిన్న ఆచారాలకు నిలయమై సకల రాజవంశాలు చక్కగా పరిపాలించిన ప్రాంతం మన కల్వకుర్తి అని కొనియాడారు.

## స్వాతంత్ర సమరయోధులు

కవులు,కళాకారులు, వాగేయకారులు, ఉద్యమకారులు, శాస్త్రవేత్తలు,చరిత్రకారులు, ఉద్దండ రాజకీయ నేతలు, క్రీడాకారులు, భక్తి సేవా తత్పరులకు కల్వకుర్తి కేంద్రంగా వెలసిందని సదానందం పేర్కొన్నారు.స్వాతంత్ర్య పోరాటాలు సాయుధ రైతాంగా పోరాటాలు, తెలంగాణ విద్యార్థి ఉద్యమం,కరువు వ్యతిరేక పోరాటాలు , మలిదశ తెలంగాణ ఉద్యమం, ఆర్డీవో సాధన ఉద్యమం,కేఎల్ఐ నీళ్ళ పోరాటాలు సామాజిక ఉద్యమాలతో కల్వకుర్తి ప్రాంతం ఎంతో చైతన్యం పొందిందని వివరించారు.జిల్లా కావలసిన లక్షణాలు15 మండలాలు కలవులి1.కల్వకుర్తి 2.వెల్దండ3.ఆమనగల్ 4.తలకొండపల్లి5.మాడ్గుల6.కడ్తాల్7.వంగూరు8.చారగొండ9.మిడ్జిల్10.ఉర్కొండ11 కేశంపేట్ఈ 10 మండలాలకు తోడుగా వెల్జాల్ మండల రఘుపతిపేట మండలం ఇర్విన్ మండలం గా మార్చాలి.డిండి మండలంలి లోని కొంత భాగాన్ని కలుపుకొని 15 మండలాలతో కల్వకుర్తి జిల్ల గా ఏర్పాటు చేయాలని విద్యావంతులు, మేధావులు, అడ్వకేట్స్, జర్నలిస్టులు, వ్యాపారస్తులు, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు,సామాన్య ప్రజలు,రైతులు కోరుతున్నారు.

గతంలో 6 మండలాలతో జిల్లా చేశారు7 మండలాలతో జిల్లా చేశారు 8 మండలాలతో జిల్లా చేశారు9 మండలాలతో జిల్లా చేశారు ఇప్పుడు 15 మండలాలతో కల్వకుర్తిని జిల్లా చేయండి ఇది న్యాయబద్ధమైన కోరికనే. ఇది మన అందరికీ సమంజసమే.నాగర్ నియోజకవర్గంలో అత్యధిక జనాభా కలిగిన ప్రాంతం మన కల్వకుర్తి.విద్యా ,వైద్యం వ్యవసాయ రంగం,రియల్ ఎస్టేట్ లో శరవేగంగా అభివృద్ధి చెందింది. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రత్యేకత శుద్ధతో ఉంటుంది. వ్యవసాయ రంగంలో నిత్య నూతన పురోభివృద్ధి కలదు. మూడు జాతీయ రహదారులు కలిపే కూడలిగా కల్వకుర్తి కలదు.హైదరాబాదు నుండి శ్రీశైలం ,హైదరాబాదు నుంచి తిరుపతి, కోదాడ నుంచి రాయచూరు వెళ్లే 3 జాతీయ రహదారులను కలిపే కేంద్రంగా కల్వకుర్తి పట్టణం వెలసింది.

3 రాష్ట్రాలను ఆంధ్రప్రదేశ్ , కర్ణాటక,తెలంగాణ, రాష్ట్రాలను కలుపుతూ నేషనల్ హైవే కనెక్టివిటీ కలదు .ప్రముఖ పణ్యక్షేత్రాలైన శ్రీశైలం, తిరుపతి , యాదగిరి గుట్ట , ఉమా మహేశ్వరం , సోమశిల, సింగోటం, మైసిగండి ,అయ్యసాగర్, సిరుసనగండ్ల , ఊర్కొండ , వెల్జాల్, పాలేం ,వట్టేం , రామగిరి,ఉర్స్ రంగాపూర్, బ్రాహ్మణ పల్లి ,ఆమనగల్, దేవాలయాలకు అందుబాటులో ఉంటుంది. ట్రిబుల్ ఆర్ రోడ్డుకు అతి సమీపంలో మరియు భవిష్యత్తులో చారిత్రాత్మకంగా మీరు నిర్మించబోయే ఫ్యూచర్ సిటీకి దగ్గరగా కల్వకుర్తి పట్టణం కలదు. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ ఫోర్ట్ 70 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. భవిష్యత్తులో మరో గొప్ప విద్య ,వైద్య ,వాణిజ్య వ్యాపార కేంద్రంగా కల్వకుర్తి ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీనియర్ జూనియర్ సివిల్, క్రిమినల్ జడ్జి కోర్టులు కలవు . నిస్వార్థ రాజకీయ నాయకులు , అభివృద్ధి కోసం పాటుపడే ఉద్యమకారులు, ఇతరులు మేలు కోరే ప్రజలు ఈ ప్రాంతంలో కలరు.ఇలా కల్వకుర్తి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది గతంలో 6 ,7 ,8 మండలాలతో జిల్లా చేశారు.ఇప్పుడు గౌరవ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆద్వర్యంలోని ఈ ప్రజా ప్రభుత్వం 15 మండలాలతో కల్వకుర్తి జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని కల్వకుర్తి జేఏసి చైర్మన్ సదానందం గౌడు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వైభవంగా శివాని--ప్రదీప్‌ల వివాహం

**నూతన వధూవరులను ఆశీర్వదించిన డా. మార్శల్ దుర్గం నగేష్, ముడిమడుగుల మల్లన్న**

అగ్నిధార న్యూస్,(రామగుండం) :

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని మార్కండేయ కాలనీ (దుర్గానగర్) ఆర్‌కే గార్డెన్స్‌లో శివాని--ప్రదీప్‌ల వివాహ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. బండారి రాజేశ్వరి, సాంబమూర్తిల కుమార్తె శివానికి, బోరె ఎల్లమ్మ, శంకరయ్యల కుమారుడు ప్రదీప్‌తో వేదమంత్రాల సాక్షిగా, బంధుమిత్రుల సమక్షంలో శాస్త్రోక్తంగా వివాహం జరిపించారు.వివాహ వేడుకకు సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్శల్ దుర్గం నగేష్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం వారు మాట్లాడుతూ, నూతన దంపతులు జీవితాంతం అన్యోన్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.గోదావరిఖని వంటి కార్మిక ప్రాంతానికి చెందిన శ్రామిక కుటుంబాల పిల్లలు ఉన్నత విలువలతో కొత్త జీవితంలోకి అడుగుపెట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. కుటుంబ బంధాలను పరిరక్షిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బండారి, బోరె కుటుంబ సభ్యులతో పాటు ప్రజాసంఘాల నాయకులు, స్థానిక కాలనీవాసులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## సింగరేణిని రాజకీయ వేదికగా మార్చొద్దు

**కార్మికుల చెమటను రాజకీయ లాభాలకు వాడుకోవద్దు**

**ఏఐటీయూసీ**

**హరీష్‌రావు వ్యాఖ్యలపై ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ విమర్శలు**

అగ్నిధార న్యూస్,( రామగుండం):

సింగరేణి బొగ్గు ఉత్పత్తి, గణాంకాల అంశాలపై చర్చించాలనుకుంటే శాసనసభ సరైన వేదిక అని, గనుల ప్రాంతాలను రాజకీయ వేదికలుగా మార్చి సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించవద్దని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాజీ మంత్రి హరీష్‌రావు తీరును విమర్శించారు.సింగరేణి సంస్థకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం, యాజమాన్యం అధికారికంగా సమాధానం చెప్పగలవని, గనుల వద్ద మీడియా సమావేశాలు నిర్వహించడం వల్ల సంస్థ పరపతికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. సింగరేణిని రాజకీయ వివాదాల్లోకి లాగడం వల్ల కార్మికుల్లో అయోమయం నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.2017లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అదనపు బొగ్గు ఉత్పత్తి గణాంకాలపై అప్పట్లోనే విమర్శలు వచ్చాయని, ప్రస్తుతం అదే పార్టీలో ఉన్న నేతలు కూడా ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లో స్పందించని వారు ఇప్పుడు నీతులు చెప్పడం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వం ఎవరిదైనా తప్పులను ప్రశ్నించడం ఏఐటీయూసీ విధానమని స్పష్టం చేశారు.

### వ్యక్తిగత గౌరవాన్ని కాపాడాలి

ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఏకవచనంతో సంబోధించడం హుందాతనం కాదన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ పరస్పర గౌరవాన్ని పాటించడం ప్రజాస్వామ్య సంస్కృతికి అవసరమని పేర్కొన్నారు.మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్ అంశంపై కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలను కావాలనే వక్రీకరించారని ఆరోపించారు. బొగ్గు దొంగతనం జరగలేదని కాకుండా, తప్పుడు గణాంకాలు చూపించడం కూడా తప్పేనని ఆయన పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. కార్మికుల మనోధైర్యం దెబ్బతినకుండా చూడాలన్నదే ఆయన ఉద్దేశమని వివరించారు.

### రాజకీయాలకు అతీతంగా సింగరేణి

రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సింగరేణిని రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చే ప్రయత్నాలను విరమించుకోవాలని రాజ్‌కుమార్ కోరారు. దాదాపు 70 వేల మంది శాశ్వత, కాంట్రాక్టు కార్మికుల జీవనోపాధి కంటే రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం దురదృష్టకరమన్నారు.గనులపై అధికారులపై ఒత్తిడి తీసుకురావడం వల్ల కార్మికులు అభద్రతకు గురవుతారని పేర్కొన్నారు. ఇప్పటికే రాజకీయ జోక్యం, అవినీతి కారణంగా సింగరేణి తీవ్ర నష్టాలను చవిచూస్తోందని, సంస్థ భవిష్యత్తుపై కార్మికుల్లో ఆందోళన నెలకొన్నదన్నారు. కార్మికుల హక్కులు, సింగరేణి ప్రతిష్ట, సంస్థ భవిష్యత్తు పరిరక్షణే ఏఐటీయూసీ లక్ష్యమని, ఈ విషయంలో కార్మికులు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్**

**తిరుపతి :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం రేణిగుంట మండలం కరకంబాడి గ్రామం, తారకరామ నగరలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ లో భాగంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ శ్రీ కాళహస్తి ఆర్ డి ఓ భాను ప్రకాశ్ రెడ్డి తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటికీ నిర్వహిస్తున్న సర్వే, ఓటర్ల వివరాల ధృవీకరణ, దరఖాస్తుల స్వీకరణ, అవసరమైన పత్రాల పరిశీలన తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ -2026 లో భాగంగా 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్ల జాబితా కి ప్రస్తుత ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను నాణ్యమైన ఓటర్ల జాబితా తయారు చేయడమే లక్ష్యం అని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, అర్హత లేని పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పులు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం మాత్రమే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఓటరు నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని, ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు

## ఇళ్ల మధ్య పెంటకుప్పలు లేకుండా చూడాలి

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ వానకాలం దృష్టిలో పెట్టుకొని ఇళ్ల మధ్యలో పెంటకుప్పలు లేకుండా చూడాలని ఏపిఎం నరసయ్య అన్నారు. శుక్రవారం జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ రజిత, ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి నరేష్ రెడ్డితో కలిసి ఇంటింటికి తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానకాలం ఆపై వ్యాధుల కాలం కాబట్టి ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమన్నారు. ఇండ్ల మధ్యల పెంటకుప్పలు ఉండడంవల్ల ఈగలు దోమలు వృద్ధి చెంది ఇళ్లల్లోకి వచ్చి వివిధ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వివరించారు. గ్రామ ప్రజలు చెత్తాచెదరని ఎక్కడపడితే అక్కడ వెయ్యకుండా చెత్త బండిలో వేయాలని చెప్పారు. ప్రతి ఒక్కరు వైద్యుల సలహాలు సూచనలు పాటించాలని వాన కాలం జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, సీసీ పుష్పలత, వి ఓ ఏ లు రేణుక, కల్పనా, దివ్య, వార్డు సభ్యులు మల్లేశం, పద్మ సత్తయ్య,నిరజ కర్ణాకర్, లక్ష్మీనరసింహులు,అశ్విని కరుణాకర్ రెడ్డి, రాజు, అశోక్, ఆంజనేయులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘం ఎన్నికల నామినేషన్ కు రేపు చివరి అవకాశం

**చెన్నాల గౌతం ఎన్నికల అధికారి చేనేత సహకార సంఘం గజ్వేల్.**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

సిద్దిపేట జిల్లా గజ్వేల్ చేనేత సహకార సంఘంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది పద్మశాలి సంఘ కులస్తులు పోటీదారులు పోటా పోటీగా నామినేషన్లు వేస్తున్నారు శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు 18 మంది డైరెక్టర్లుగా నామినేషన్ వేయడం జరిగిందని ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. తేదీ.04.07.26 శనివారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 వరకు నామినేషన్లకు చివరి అవకాశం. తేదీ: 05. 07. 26 రోజున స్క్రూటినీ ఉంటుందని, తేదీ:06.07.26 రోజున నామినేషన్ ఉపసంహరనాకు అవకాశం ఉందని అదే రోజు ఫైనల్ బ్యాలెట్ పేపర్ గుర్తులు కేటాయించబడతాయన్నారు. తేదీ 10. 7. 2026 ఉదయం 8 :00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఎలక్ష న్ జరుగు తుందన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుండి ఎలక్షన్ ఫలితాలు వెల్లడిస్తారని తెలిపారు. తేదీ: 11.07.26 శనివారం రోజున గెలిచిన డైరెక్టర్లు అందరూ కలిసి అధ్యక్షుని, ప్రధాన కార్యదర్శి, సంఘ కోశాధికారిని ఎన్నుకుంటారని, ఎన్నికల అధికారి గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## హార్టికల్చర్ ఎంట్రప్రెన్యూర్షిప్, స్కిల్ డెవలప్మెంట్ పై వర్క్షాప్

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ నియోజకవర్గం శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఫర్ హార్టికల్చరల్ సైన్సెస్ పీజీహెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన "హార్టికల్చర్ ఎంట్రప్రెన్యూర్షిప్ స్కిల్ డెవలప్మెంట్" పై మూడు రోజుల వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమం లో డా. డి. రాజి రెడ్డి ఉద్యాన విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ పాల్గొని, హార్టికల్చర్ రంగంలో ఎంట్రప్రెన్యూర్షిప్ ప్రాధాన్యత, నైపుణ్యాభివృద్ధి పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. యువతలో ఆవిష్కరణాత్మక ఆలోచన, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వ్యవసాయ ఉత్పత్తుల విలువ ఆధారిత ప్రాసెసింగ్ ద్వారా హార్టికల్చర్ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ తరహా కార్యక్రమాలు తెలంగాణను హార్టికల్చర్ ఎంట్రప్రెన్యూర్షిప్ హబ్ గా నిలబెట్టడంలో కీలకమని, యూనివర్సిటీ మరిన్ని శిక్షణా కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు.పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల వినూత్న ప్రాజెక్టులు వ్యవసాయ, ఆహార, ఔషధ రంగాల్లో వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టారు పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు. పండ్లను పొడిగా మార్చి పోషక విలువలు కోల్పోకుండా నిల్వ చేసే 'జుజు ఫ్రూట్ పౌడర్' ప్రాజెక్టు ఆరోగ్యకరమైన ఆహారానికి బాటలు వేస్తోంది. ఆకులు, పూల రేకుల నుంచి మైక్రోగ్రీన్స్, తినదగిన పూలను ఉత్పత్తి చేసే పద్ధతి నగరాల్లో పోషకాహారానికి కొత్త మార్గం చూపిస్తోంది. ఉద్యాన వ్యర్థాలను 'న్యూట్రి సైకిల్' విధానంలో సౌందర్య సాధనాల తయారీకి వినియోగించే ప్రాజెక్టు పర్యావరణ హితంగా నిలుస్తోంది. ఎముకల బలానికి ఉపయోగపడే నల్లేరు మొక్కతో 'బూస్టెగ్స్ పౌడర్', మాతృత్వ దశలో ఉన్న మహిళలకు ప్రత్యేక పోషకాహారాన్ని అందించే 'న్యూట్రిబాక్స్ మమ్మా' ఫుడ్ డెలివరీ యాప్ ప్రాజెక్టులు ఆరోగ్య రంగంలో కీలకంగా మారనున్నాయి. అదేవిధంగా పండ్లు, కూరగాయల నిల్వకాలం పెంచే 'ఎడిబుల్ కోటింగ్' టెక్నాలజీ, మల్టీవిటమిన్‌లతో కూడిన 'చెకురమనిస్ లీఫ్ పౌడర్' వంటి ప్రాజెక్టులు వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ స్థానిక వనరులను వినియోగించుకుంటూ, ఆరోగ్యం, పోషకాహారం, సుస్థిరత అనే మూడు అంశాలపై దృష్టి సారించడం విశేషం.ఈ వర్క్‌షాప్‌ను ఐకార్గ్ సహకారంతో నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన శిక్షణలో విద్యార్థులు, పరిశోధకులు యువ రైతులు పాల్గొని, వ్యాపార అవకాశాలు, స్టార్టప్ మోడల్స్, సుస్థిర వ్యవసాయ పద్ధతులు పై అవగాహన పొందారు. ఈ సందర్భంగా, ఎంటర్ప్రెన్యూర్షిప్, కెరియర్ పాత్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్ లపై ఉన్న ప్రముఖ పుస్తకాలను ఈ సందర్భంగా విద్యార్థులకు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వర్సిటీ కన్సల్టెంట్ డాక్టర్ కే. వీరాంజనేయులు, ఐకార్గ్ అధినేత ప్రొఫెసర్ ఐ వి మురళీకృష్ణ గారు, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఫర్ హార్టికల్చర్ ప్రొఫెసర్ డాక్టర్ వి సుచిత్ర, డాక్టర్ సతీష్, పులి శ్రీనివాస్, ఎస్ సింధుజ, బి చంద్రశేఖర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా పర్యటన విజయవంతం...

### ముఖ్యమంత్రి నారా. చంద్రబాబు నాయుడు కి రేణిగుంటలో ఘన వీడ్కోలు?

**రేణిగుంట :** తిరుపతి జిల్లాలో మూడు రోజుల పాటు సాగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన అత్యంత విజయవంతంగా ముగిసింది. జిల్లాలో పలు అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, ప్రజల్లో సరికొత్త ఉత్సాహాన్ని

## జైపాల్ రెడ్డి మాతృమూర్తి మరణం విషాదకరం

**మృతదేహానికి నివాళులర్పించిన ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి గ్రామంబీఆర్ఎస్ పార్టీ మాజీ మాడ్గుల మండల అధ్యక్షులు జైపాల్ రెడ్డి తల్లి ఎమిరెడ్డి పెద్ద లక్ష్మమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి నివాసానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, జైపాల్ రెడ్డి తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని,పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో,మాడ్గుల పి ఎ సి ఎస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, మాజీ సర్పంచ్లు కృష్ణారెడ్డి,యాది రెడ్డి,పవన్ కుమార్ రెడ్డి,మాజీ మండల పార్టీ అధ్యక్షులు లాలయ్య,అవురుపల్లి సర్పంచ్ పోశయ్య,వార్డు సభ్యులు యాదయ్య,కొండల్ రెడ్డి,పార్టీ నాయకులు,కార్యకర్తలు, గ్రామ పెద్దలు,పాల్గొని దివంగతురాలికి నివాళులర్పించారు.

## కక్షపూరితంగానే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రత తొలగింపు

**ఖండించిన బీ ఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ అధ్యక్షులు వట్టేపు కిషోర్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పై కక్షపూరితంగానే భద్రతను తొలగించారని బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ అధ్యక్షులు వట్టేపు కిషోర్ పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సార్ వారి కుటుంబానికి ప్రాణాలను రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వానేనని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్ ఎస్ పి భద్రత కుదించడంపైన మరియు నిరంతరం ప్రజల పక్షాన , కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీల అమలుపైన మీద , రైతుల పైన, విద్యాసంస్థలలో గురుకుల విద్యాలయాలలో టెండర్ల అవినీతి పైన , ఇలా రాష్ట్రంలో సమస్య ఏదైనా దానిపైన గట్టిగా ప్రభుత్వానీ ప్రశ్నిస్తూ ఎప్పటికప్పుడు ప్రభుత్వం చేసే అరాచకాలను ఎండగడుతూ ప్రజలకు తెలియజేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సార్ మీద రాజకీయ కక్ష సాధింపులో భాగంగా ఆర్ఎస్పీ ప్రవీణ్ కుమార్ బులెట్ ప్రూఫ్ కార్ మరియు ప్రభుత్వ సిబ్బందిని తొలగించడం జరిగింది.నిన్న గురుకుల విద్యా సంస్థల మీద చర్చల పేరుతో సవాల్ విసిరిన మంత్రులకు ప్రతి సవాల్ గా చర్చ కు సిద్ధమని సవాల్ విసిరి చర్చకు వస్తుంటే పోలీసులు అరెస్ట్ చేయడం జరిగింది అదేవిధంగా ప్రవీణ్ సార్ సతీమణి అయిన లక్ష్మీ భాయ్ అగ్రికల్చర్ డిపార్మెంట్లో గత 20 సంవత్సరాలుగా సేవలు చేస్తున్నటువంటి ఆమె పైన సంవత్సరం అయితే రిటైర్మెంట్ అయితది అని తెలిసి కూడా కావాలని లక్ష్మీబాయి ని వేరే డిపార్మెంట్ కి ట్రాన్స్ఫర్ చేయడం జరిగింది.. ఇలా కుటుంబం మీద వ్యక్తిగతంగా కాకుండా దమ్ముంటే రాజకీయంగా ప్రవీణ్ సార్ తో ఎదుర్కోవాలి అని, ఒక దళిత సామాజిక వర్గానికి చెందిన విద్యావేత్త , గురుకులాల ద్వారా లక్షలాదిమంది విద్యార్థులను విద్య ఒకే వైపు నడిపిస్తున్న ప్రవీణ్ సార్ పైన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎలా చేయడం సబబు కాదు , ఇది ముమ్మాటికి రాజకీయ కక్ష సాధింపు చర్యగా భావిస్తూ , ఇలా కావాలి అని ఆర్ఎస్పి కుటుంబం మీద గాని కక్ష సాధింపు చర్యలు చేపడితే భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వానికి మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పుట్ట గతులు ఉండవు అని ఆర్ ఎస్పీ జోలికి వస్తే రాష్ట్రం అగ్నిగుండం అవుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను అన్నారు.ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముత్యాల రమేష్ , వార్డు సభ్యులు నరేష్, ఎస్సి సెల్ మండల కార్యదర్శి రామకృష్ణ, ఉప అధ్యక్షులు జోగు విష్ణు, యువ నాయకులు వట్టేపు గణేష్ , విష్ణు , క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాల పేరుతో వసూళ్ల దందాలు

**ప్రైవేట్ పాఠశాలపై దాడి చేస్తే సహించం ట్రస్మా**

**ట్రస్మ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ , ట్రెజరర్ రాఘవేంద్ర రెడ్డి**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ నియోజకవర్గం విద్యార్థి సంఘాల పేరుతో ప్రైవేట్ పాఠశాలలపై దాడులు చేస్తే పాఠశాల ప్రాంగణాన్ని భయభ్రాంతులకు గురి చేస్తే సహించేది లేదని ట్రస్మ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్ ట్రెజరర్ రాఘవేందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. జగదేవపూర్ మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం రోజు మండల కేంద్రంలో గల ది మాస్టర్ మైండ్ పాఠశాలలో ఏబీవీపీ విద్యార్థి సంఘం పేరు చెప్పుకొని కొంతమంది పాఠశాలకు వచ్చి విద్యార్థులను ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందని మండిపడ్డారు. సమావేశాల పేరుతో డబ్బులు అడగగా కాదు అనడంతో అసభ్య పదజాలంతో మాట్లాడుతూ శాంతి శాంతిభద్రతలకు విఘాతం కలిగే విధంగా ప్రవర్తించడం జరిగిందని అన్నారు. వారిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థి సంఘాల పేరుతో ఎవరైనా సరే ప్రైవేటు పాఠశాలలపై ఒత్తిడి తీసుకురావడం గాని వసూళ్ల దందాలు చేయడం గానీ చేస్తే సంఘం తరఫున సహించేది లేదని అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో బుక్స్ అమ్ముకోవడానికి సంబంధించి హైకోర్టు నుండి స్టే తీసుకున్నామని జీవో ఎంఎస్ నెంబర్ 91 ప్రకారం ఎమ్మార్పీ ధరల కంటే తక్కువ ధరలకు విద్యార్థులకు అందించవచ్చునని తెలిపారు. కానీ కొంతమంది చదువుకునే విద్యార్థులు కూడా ఖర్చులకోసం సంఘాల పేరుతో డబ్బులు వసూలు చేస్తే ప్రైవేట్ పాఠశాల సంఘం ఏ కోశానా కూడా సమర్థించదని అన్నారు. విద్యార్థుల మంచి భవిష్యత్తు కోసం మాకు సహకరిస్తే మంచి విద్య విద్యార్థులకు అందించడం జరుగుతుంది అన్నారు. ఏ విద్యార్థి సంఘమైన కూడా విద్యార్థులకు అందించే విద్యపై తమకు సహకరిస్తే భవిష్యత్తులో ప్రైవేట్ పాఠశాల విద్యార్థులను కూడా ఉన్నత స్థాయిలో ఉంటారని తెలిపారు. విద్యార్థులకు విద్యను అందించడానికి ప్రశాంత వాతావరణంలో విద్యనాభ్యసిస్తున్న విద్యార్థుల పరిసరాలకు చేరుకొని అసభ్య పదజాల మాటలు మాట్లాడడం మరియు మహిళా టీచర్లు పనిచేస్తున్న పాఠశాలలో అల్లరి మూకలుగా చేరి అసభ్యకరంగా ప్రవర్తించడం సిగ్గు చేటు అని సమాజానికి చెడు సంకేతాలు ఇచ్చినట్లు అవుతుందని తెలిపారు. రాష్ట్ర పోలీస్ ఉన్నత అధికారి డీ జి పి కి కూడా ఈ అంశం పై పిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ట్రస్మా అధ్యక్షులు మనోజ్ కుమార్ రెడ్డి, సెక్రటరీ సంతోష్, జిల్లా కార్యదర్శి ఇన్న రెడ్డి, గౌరవ అధ్యక్షులు సోమేశ్వర్ రెడ్డి, రాజు, జగదేవపూర్ అధ్యక్షులు నర్సింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామస్వామి ట్రస్మ సంఘం నాయకులు తదితరులు ప్రభాకర్ రెడ్డి, దయాకర్, ప్రేమ్, అంబదాస్,రావుఫ్ ఖాన్ , మోహన్, సత్యం, శ్రీకాంత్, మధుబాబు, ప్రకాష్ ,మణికంఠ, రవి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవకులు ప్రజలు మెచ్చిన నాయకులు, సమాజ శ్రేయస్సు తపించే నాయకులు

**గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

ప్రజా సేవకులు ప్రజలు మెచ్చిన నాయకులు సమాజ శ్రేయస్సు కోసం అనునిత్యం పని చేసే ముందున్న నాయకులు గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన బాధితులు అనేమైన మాధవి భర్త లాలయ్య, కాదుర్ల కృష్ణ తండ్రి బాలయ్య, కాదుర్ల పుష్ప కర్ణాకర్ హాస్పిటల్ చేరగా అధిక ఖర్చులు నిమిత్తము గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి దృష్టికి తీసుకుపోగా సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగ మాజీ మంత్రి హరీష్ రావు,ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సి వంటేరు యాదవ రెడ్డి మాజీ యఫ్ డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి సహకారంతొ సీఎం సహాయ నిధి మంజూరైయ్యాయి. బాధితులకు అనమైన మాధవి లాలయ్య రూపాయలు రూ.56000/- కాదుర్ల కృష్ణ కు రూ. 35000/- కాదుర్ల పుష్ప కు రూ. 15000/-మంజూరైన రూపాయల చెక్కును గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవలో అనునిత్యం ముందుటూ సమాజ శ్రేయస్సు కోసం నిస్వార్థశీగా ప్రజలకు అండగా ఉంటున్నామని అన్నారు. అదేవిధంగా అధికారం ఉన్న లేకున్నా ప్రజలకు సేవ చేస్తున్నామని పేర్కొన్నారు.వారితోపాటుగా నాయకులు కేశమైన మహేందర్ యాదవ్ మాజీ ఉప సర్పంచ్ జూపల్లి భాస్కర్ గ్రామ బి ఆర్ యస్ అధ్యక్షులు జూపల్లి మధు నాయకులు గోదాల భాస్కర్ రెడ్డి బొల్లు ఐలయ్య యాదవ్ బొల్లు మహేష్ యాదవ్ కేశపురం పెద్దులు కాదుర్ల స్వామి తదితరులు ఉన్నారు.

# ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

**ప్రశ్న రావణ్‌పై అక్రమ కేసులు, అరెస్టులను ఖండించిన డా. మార్షల్ దుర్గం నగేష్**
**కోర్టులు బెయిల్ ఇస్తున్నా మళ్లీ కేసులు పెట్టడం దుర్మార్గం**
**కేసులు ఉపసంహరించుకోకుంటే రెండు రాష్ట్రాల్లో ఉద్యమం తప్పదని హెచ్చరిక**

**అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్):**

ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను అక్రమ కేసులు, అర్ధరాత్రి అరెస్టులతో అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి తీవ్రమైన విఘాతమని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ తీవ్రంగా మండిపడ్డారు. జర్నలిస్టు ప్రశ్న రావణ్‌పై నమోదైన వరుస కేసులు, పోలీసుల వ్యవహార శైలిని ఖండిస్తూ శుక్రవారం మీడియాతో ఆయన ఘాటుగా మాట్లాడారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న అణచివేత రాజకీయాలు

ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయించడం అధికార దుర్వినియోగానికి పరాకాష్టగా మారిందని డా. నగేష్ విమర్శించారు. ప్రజల సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టులను వేధించడం ద్వారా ప్రశ్నించే స్వరాలను అణచివేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

అర్ధరాత్రి వేళ ఇళ్లపై దాడులు చేసి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య పాలనకు సంకేతం కాదని, ఇది నిరంకుశ ధోరణులకు నిదర్శనమని ధ్వజమెత్తారు. సామాజిక మాధ్యమాల్లో ప్రముఖ ప్రజా సంఘాల నాయకులు జర్నలిస్టులు వ్యక్తం చేసిన ఆవేదన కూడా దేశంలో ప్రజాస్వామ్య పరిస్థితులపై నెలకొన్న ఆందోళనకు అద్దం పడుతోందని పేర్కొన్నారు.

**ప్రశ్న రావణ్ అరెస్ట్ కక్షసాధింపే**

హైదరాబాద్‌లో అర్ధరాత్రి సమయంలో ప్రశ్న రావణ్‌ను అరెస్టు చేసి ఆంధ్రప్రదేశ్‌కు తరలించడం పూర్తిగా కక్షసాధింపు రాజకీయాల్లో భాగమేనని డా. మార్షల్ దుర్గం నగేష్ ఆరోపించారు. అరెస్టుకు సరైన ఆధారాలు లేవని న్యాయస్థానం భావించి బెయిల్ మంజూరు చేసినప్పటికీ, వెంటనే మరో కేసు నమోదు చేసి మళ్లీ జైలుకు పంపించడం చట్టవ్యవస్థను అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు.

రెండోసారి కూడా కోర్టు బెయిల్ ఇచ్చిన అనంతరం మరిన్ని కేసులు సిద్ధంగా ఉన్నాయని ప్రకటించడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని విమర్శించారు. న్యాయస్థానాలు పదేపదే తప్పుపడుతున్నా ప్రభుత్వ వైఖరిలో మార్పు కనిపించకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకర సంకేతమన్నారు.

**జర్నలిస్టు కుటుంబాలపై వేధింపులు అమానుషం**

ప్రశ్న రావణ్ కుటుంబ సభ్యుల పట్ల పోలీసులు ప్రదర్శించిన తీరును డా. నగేష్ తీవ్రంగా ఖండించారు. మహిళల పట్ల కనీస గౌరవం, మానవత్వం లేకుండా వ్యవహరించడం చట్ట పరిరక్షక వ్యవస్థకే మచ్చ తెచ్చే చర్యగా అభివర్ణించారు.

ఒక జర్నలిస్టు కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేయడం ద్వారా ప్రజాస్వామ్య స్వేచ్ఛలను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అనాగరిక చర్యలను ఏ నాగరిక సమాజమూ అంగీకరించదని స్పష్టం చేశారు.

**రాజకీయ పార్టీల ద్వంద్వ వైఖరిపై నిప్పులు**

ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష పార్టీల ద్వంద్వ వైఖరిని కూడా డా. మార్షల్ దుర్గం నగేష్ ఎండగట్టారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో విధంగా వ్యవహరించడం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమని పేర్కొన్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు జరుగుతున్నప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. జర్నలిస్టుల హక్కుల విషయంలో రాజకీయాలకు అతీతంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

**ప్రజల తీర్పే అంతిమం**

ప్రజాస్వామ్యంలో ఏ అధికారం శాశ్వతం కాదని, అధికార అహంకారంతో వ్యవహరించే పాలకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని డా. నగేష్ హెచ్చరించారు. ప్రజలు అన్నింటినీ నిశితంగా గమనిస్తున్నారని, అణచివేత రాజకీయాలు ఎన్నటికీ విజయవంతం కావని స్పష్టం చేశారు.

ప్రశ్న రావణ్‌పై నమోదు చేసిన తప్పుడు కేసులన్నింటినీ వెంటనే బేషరతుగా ఉపసంహరించుకుని ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాలు, సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల్లోనూ భారీ ఆందోళనలు, ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

**జర్నలిస్టుల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే రాజీలేని పోరాటం.**

జర్నలిస్టుల స్వేచ్ఛను హరించే ప్రతి చర్యను సమతా సైనిక దళ్ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం కొనసాగిస్తామని డా. మార్షల్ దుర్గం నగేష్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని, అణచివేత విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుకు లేఖ రాస్తున్న..

# రాత పూర్వకంగా జావాబివ్వాలి

**హైదరాబాద్ :** నేను నా మాటకు కట్టుబడి ఉన్నాను ఈ రోజు కి కూడా ..ఆపరేషన్ సక్సెస్ , పేషంట్ డెడ్ అన్నట్లు బీఆర్ఎస్ తీరు ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం అయన మీడియాతో మాట్లాడారు. తాము చేసిన అప్పులు మూడు లక్షల పదిహేడు వేల పదిహేను కోట్లు అని ఒక సారి, మూడు లక్షల 85,340 కోట్లు మాత్రమే అని మరో సారి కేటీఆర్ చెప్పాడు. 4 లక్షల 26 వేల 99 కోట్ల అప్పు అని ఒక సారి,4 లక్షల 17 వేల 496 మాత్రమే అని మరోసారి హరీష్ రావు చెప్పాడు. హరీష్ రావు, కేటీఆర్ అసెంబ్లీలో మాట్లాడిన దానికి కట్టుబడి ఉన్నారా. నా మాటకు కట్టుబడి ఉన్నా.. రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నా. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుకు లేఖ రాస్తున్న.. రాత పూర్వకంగా సమాధానం ఇవ్వాలి. వాట్సాప్ ,మెయిల్ , స్పీడ్ పోస్ట్ ద్వారా ఈ లేఖ ను సీల్డ్ కవర్ లో పంపుతా. నేను చెప్పినదానికి కట్టుబడి ఉన్నా.. మంత్రి పదవి, ఎమ్మెల్యే పదవి రాజీనామా చేస్తానని అన్నారు. మీరు చెప్పింది అబద్ధం అయితే వాళ్లు ఏం చేస్తారో చెప్పాలి.. రాత పూర్వకంగా చెప్పాలి. ఏదో మాట్లాడి అసలు దానికి జవాబు చెప్పకుండా తప్పుదారి పట్టిస్తున్నారు. అప్పులు మూడు రకాలుగా ఉంటాయి. బీఆర్ఎస్ హయాంలో అప్పులు, బకాయిలు కలిపి 8,21,651 కోట్ల అప్పులు చేశారు. కార్పొరేషన్లు తెచ్చిన అప్పులతో మాకు సంబంధం లేదు, మేం తేలేదని చెపుతున్నారు.మీరు అప్పులు తేకపోతే ప్రభుత్వ ఖజానా నుంచి ఎందుకు చెల్లించారు. కాళేశ్వరం, పాలమూరు కోసం అప్పులు తెస్తే వాటిని రైతులతో కట్టిస్తారా? మిషన్ భగీరథ పేరుతో తెచ్చిన అప్పులు ఎవరు కడతారు..?



మంచి నీళ్లు తాగుతున్న ప్రజలతో కట్టిస్తారా..? కేసీఆర్ అసెంబ్లీ కి రావడం లేదు.. కనీసం మీడియా ను పిలిచి కేసీఆర్ మాట్లాడాలి. 5 గంటలకు నేను ప్రెస్ క్లబ్ కు వస్తా.. అక్కడైనా చర్చకు సిద్ధం. రుజువు చేయపోతే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తారా.. పార్టీని కేసీఆర్ రద్దు చేస్తారా.. సమాధానం తీసుకుని రావాలి. నేను రాజీనామాకు సిద్ధయని అన్నారు. మిస్టర్ హరీష్ రావు, కేటీఆర్.. ఆనాడు పాలమూరు పౌరుషం , చీము ,నెత్తురు ఉండబట్టే మంత్రి పదవికి రాజీనామా చేశా. కుడి భుజం, ఎడమ భుజం అని చెప్పుకున్న మహబూబ్ నగర్ లో ఒక్క సీటు తేలేకపోయారు. నేను రాజీనామా చేశాకే జిల్లాలో 6 సీట్లు బీఆర్ఎస్ కు వచ్చాయి. నా రాజీనామా ప్రభావం రాష్ట్రమంతా ఉంది. నేను మాటకు కట్టుబడి ఉండే వ్యక్తిని. సిగ్గుతప్పిన మాటలు మాట్లాడుకుంటు నాకు పౌరుషం లేదని అంటున్నారు. హరీష్ రావు వస్తానని అన్నాడు కాబట్టే అమరవీరుల స్థూపం వద్దకు వస్తానని చెప్పాను. తెలంగాణ భవన్ కు రాలేదన్న వంక చూపించి విమర్శిస్తున్నారు. నేను అబద్దాలు చెప్పను.. నా ఆత్మగౌరవాన్ని ప్రశ్నించలేరు. ఆత్మ గౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి నేను గతంలో రాజీనామా చేశాను. ఉద్యోగానికి వెళ్లకుండా ఊరు వెళ్లి వ్యవసాయం చేసుకున్నాను. మీ లాగా అడ్డగోలుగా సంపాదించలేదు. అడ్డగోలు మాటలు మాట్లాడి ఆరోపణలు చేస్తే కబర్దార్. పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా, తన్నీరు పౌరుషమో చెప్పాలి. నేను తోకముడిచేవాన్నీ కాదు. నాకు పదవులు ముఖ్యం కాదు.. ఆత్మగౌరవం ముఖ్యం. నా సవాల్ కు కట్టుబడి ఉన్నా. మీ పౌరుషం, రోషం, పరమితి ఏమిటో దమ్ము ధైర్యం ఉంటే చెప్పాలి. కూట్లో రాయి తీయలేనోడు,ఏట్లో రాయి తీస్తా అన్నట్లుగా కేటీఆర్, హరీష్ రావు తీరు ఉంది.. ఎన్నికల ముందు అవుటర్ రింగ్ రో?డ్డ ను అమ్మి రైతు బంధు కింద 5,800 కోట్లు మాత్రమే చెల్లించారని అన్నారు.

# ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కట్టు దిట్టంగా అమలు చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**నిబంధనలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు**

**గోదావరిఖని:** పెద్దపెల్లిజిల్లాలోని గోదావరిఖనిలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆహార పదార్థాల నిల్వ, తయారీ, పరిశుభ్రత, వడ్డింపు వంటి అన్ని అంశాల్లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పనిచేసే సిబ్బందికి ఆహార భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, వినియోగదారుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసి, అవసరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం మాత్రమే తిరిగి నిర్వహణకు అనుమతులు ఇస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.మే 29న మంథని మార్కెట్ ప్రాంతంలోని శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్, జూన్ 13న గోదావరిఖనిలోని డెస్టినేషన్ రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి ఆయా రెస్టారెంట్లను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలిపారు. తదనంతరం ఆయా సంస్థల నిర్వాహకులు పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు చేపట్టడంతో, ఫుడ్ సేఫ్టీ అధికారుల పునఃపరిశీలన అనంతరం శ్రీ సాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ మెస్‌కు జూన్ 4న, డెస్టినేషన్ రెస్టారెంట్‌కు జూన్ 30న తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఇతర హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ఎక్కడైనా అపరిశుభ్రత లేదా నిబంధనల ఉల్లంఘన గుర్తించిన వెంటనే సంబంధిత సంస్థలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తూచా తప్పకుండా పాటించి ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని



అందించాలని జిల్లా కలెక్టర్ ప్రకటన లో పేర్కొన్నారు.

## మెడికల్ అన్‌ఫిట్ కార్మికులకు సూటబుల్ జాబ్

**ఏఐటీయూసీ పోరాట ఫలితమేనని రంగు శ్రీను వెల్లడి**
**జూలై 6న కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

సింగరేణి అండర్‌గ్రౌండ్ గనుల్లో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో మెడికల్ అన్‌ఫిట్‌గా ప్రకటించబడి, ప్రస్తుతం సర్ఫేస్‌లో జనరల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న మైనింగ్ స్టాఫ్, ఈ అండ్ ఎం సూపర్‌వైజర్లు, ట్రేడ్స్‌మెన్‌లకు సూటబుల్ జాబ్ కల్పించేందుకు యాజమాన్యం చర్యలు ప్రారంభించిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను తెలిపారు.శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఏఐటీయూసీ చేపట్టిన పోరాటం, సమ్మె నోటీసు ఫలితంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం జూన్ 8న ఇచ్చిన సమ్మె నోటీసులో సూటబుల్ జాబ్ అంశాన్ని ప్రధాన డిమాండ్‌గా చేర్చినట్లు వివరించారు.ఈ నేపథ్యంలో జూన్ 25న హైదరాబాద్‌లో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చల్లో జూలై 10లోపు సమస్యల పరిష్కారానికి యాజమాన్యం, యూనియన్ పరస్పరం చర్చించుకోవాలని సూచించారని తెలిపారు. అనంతరం యాజమాన్యం జూలై 6న కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్‌లో వైద్య పరీక్షలకు హాజరు కావాలని సంబంధిత కార్మికులకు ఆదేశాలు జారీ చేసిందన్నారు.వైద్య పరీక్షల అనంతరం అర్హులైన కార్మికులకు సూటబుల్ పోస్టుల్లో నియామకాలు చేపట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. గతంలో స్ట్రక్చర్ సమావేశంలో యాజమాన్యం అంగీకరించినప్పటికీ అమలు చేయకుండా పెండింగ్‌లో ఉంచిందని, ఏఐటీయూసీ సమ్మె నోటీసు, లేబర్ కమిషనర్ జోక్యంతోనే ఇప్పుడు వైద్య పరీక్షలకు మార్గం సుగమమైందని చెప్పారు.జూలై 6న జరిగే మెడికల్ టెస్టులకు సంబంధిత కార్మికులు తప్పనిసరిగా హాజరుకావాలని, సూటబుల్ జాబ్‌లు పూర్తిగా అమలయ్యే వరకు ఏఐటీయూసీ పోరాటం కొనసాగుతుందని రంగు శ్రీను స్పష్టం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో యూనియన్ పోరాట ఫలితమే ఈ నిర్ణయమని కార్మికులు గుర్తించాలని ఆయన కోరారు.

## వీబీజీ రామ్ జీ తో కేంద్రానికి పేరుస్తుందని కాంగ్రెస్‌కు అక్కసు

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

**కరీంనగర్ :** కరీంనగర్ లో పలు అభివృద్ది పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి. వీబీజీ రామ్ జీ పథకం ద్వారా పేదలకు ఎంతగానో మేలు జరగడంతోపాటు గ్రామాల్లో ఆస్తుల సృష్టి జరగబోతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ పథకాన్ని అమలు చేస్తే కేంద్రానికి మంచి పేరుస్తుందని అక్కసుతోనే సుప్రీంకోర్టును ఆశ్రయిం చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఈ స్కీం అమలు రాష్ట్రానికి భారం అన్పిస్తే ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లాలే తప్ప కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలనుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులు, టీచర్లకు బ్రేక్ ఫాస్ట్, పాలు, లంచ్ సౌకర్యం కల్పించడాన్ని కేంద్ర మంత్రి స్వాగతించారు. ఒకవైపు బ్రేక్ పాస్ట్ సౌకర్యం కల్పిస్తూనే మరోవైపు రాష్ట్రంలో ఏకంగా 10 వేల స్కూళ్లను మూసివేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడమేంటని ప్రశ్నించారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాఠశాలలను మూసివేయడం దుర్మార్గమన్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో బాధ్యులపై ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం వెనుక కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మ్యాచ్ పిక్సింగ్ జరగడమే కారణమన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుతోందని, చాపకింద నీరుగా బలపడుతుండటంతో ఓర్వలేకి కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కుమ్మక్కై బిగ్ బాస్ షోను తలపించేలా డ్రామాలాడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీలు అవినీతి పార్టీలేనని, అందుకే బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. అందుకే తెలంగాణ ప్రజలు ఆ రెండు పార్టీలను ఎలిమినేషన్ చేసి డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఈరోజు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ కేఏపీపీ చంద్ర టింకు తో కలిసి కరీంనగర్ లోని 37వ డివిజన్ లో రూ.77 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. షాషామహల్ ప్రాంతంలో ఓపెన్ జిమ్ ను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే:కరీంనగర్ లోనా 37వ డివిజన్ లో రూ.77 లక్షల మన్సిపల్ సాధారణ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉంది. 7వ డివిజన్ లో బీజేపీ గెలవదని చాలా మంది చెప్పారు. కానీ గెలిచి చూపించాం చంద్రను ఆశీర్వించారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం సమస్యల్లేని డివిజన్ గా తీర్చిదిద్దుతా. మరో వారం రోజుల్లో రూ.50 కోట్ల యూడీఎఫ్ నిధులతో కరీంనగర్ లో రోడ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభించబోతున్నాం.

## ఎస్ఆర్ఆర్ అటనామస్ కళాశాల పీజీ సెమిస్టర్ ఫలితాల విడుదల

**కరీంనగర్ :** స్థానిక శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ అటనామస్ కళాశాల పీజీ మొదటి మూడవ సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ అధ్యాపకుల బృందంతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట్ల రామకృష్ణ కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ పీజీ మొదటి సెమిస్టర్ లో 233 మంది పరీక్షలు రాయగా 213 మంది ఉత్తీర్ణత సాధించి 91 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా, పీజీ మూడవ సెమిస్టర్ లో 246 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 215 మంది ఉత్తీర్ణత సాధించి 87 శాతం ఉత్తీర్ణతను నమోదు చేసినట్లు తెలియజేశారు. విద్యార్థులు వలీజీఎఎతీజీనిఇష్ట్ర.ఇనీఎ వెబ్సైట్లో తమ ఫలితాలను చూసుకోవచ్చని తెలిపారు.

## మూడు విండోలకు కొత్త పాలకవర్గాలు నియామకపు ఉత్తర్వులు జారీ

**కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని మానకొండూర్, తాడికల్, మెట్ పల్లి ప్రాథమిక సహకార పరపతి సంఘాలకు నూతనంగా చైర్మన్లు నియామకయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ ఉత్వర్వులు జారీ చేశారు. మానకొండూర్ "విండో" చైర్మన్ నాగిశెట్టి రాజయ్యమానకొండూర్ సింగిల్ విండో చైర్మన్ గా కొండపలకల గ్రామానికి చెందిన నాగిశెట్టి రాజయ్య, డైరెక్టర్లుగా ఏనుగుల చొక్కారెడ్డి(సదాశివపల్లి), కత్తెర్ల రాజు (అన్నారం), మంగురపు నర్సవ్వ(అన్నారం), గోని తిరుపతిగౌడ్ (చెంజర్ల), గాలి మొగిలి(చెంజర్ల), కొట్టె అంజిరెడ్డి (ఈదుల గట్టెపల్లి), ఎం.రామకృష్ణ (గంగిపల్లి), దూలం దేవేంద్ర (కొండపలకల), కొలిపాక మొగిలి(కొండపలకల), బుర్ర శ్రీకాంత్ (మద్దికుంట), కుర్ర వెంకటస్వామి (మానకొండూర్), ఏగోళపు శ్రీనివాస్ గౌడ్(ముంజంపల్లి) నియామకయ్యారు. తాడికల్ "విండో" చైర్మన్ గా కీసర సంపత్‌శంకరపట్నం మండలం తాడికల్ సింగిల్ విండో చైర్మన్ తాడికల్ గ్రామానికి చెందిన కీసర సంపత్, డైరెక్టర్లుగా కల్లెపల్లి రాజయ్య(కేశవపట్నం), తుమ్మేటి కొండల్ రెడ్డి (అంబాలపూర్), గీట్ల గోపాల్ రెడ్డి( ఇప్పలపల్లి), సంబు తిరుపతి(కరీంపేట్), గాజుల లస్మవ్వ(కేశవపట్నం), సుద్దాల రాజేందర్ (ముత్తారం), జనగాం రాజయ్య(తాడికల్), తిరుపతి సమ్మయ్య(తాడికల్), పింగళి జయలక్ష్మి(తాడికల్), తాళ్లపల్లి కొమురయ్య(వన్నారం), ఓదెల రాజయ్య (ఎరడపల్లి), కలకుంట్ల సత్యనారాయణ రావు (ఎరపడపల్లి) నియామకయ్యారు. మెట్ పల్లి "విండో" చైర్మన్ గా గాజుల మహేష్‌మెట్ పల్లి సింగిల్ విండో చైర్మన్ గా మొలంగూర్ గ్రామానికి చెందిన గాజుల మహేశ్, డైరెక్టర్లుగా పొన్నోజు సదానందం(మెట్ పల్లి), నాంపెల్లి శ్రీనివాస్ (ఆముదాలపల్లి), పెద్ది ముత్తారెడ్డి (ఆముదాలపల్లి), వంగల కృష్ణారెడ్డి (కన్నాపూర్), కాల్వ మహేందర్ రెడ్డి (కన్నాపూర్), ఉప్పుగళ్ల రాజిరెడ్డి (కొత్తగట్టు), అంబాల కోటి (కొత్తగట్టు), గాజుల నిర్మల( లింగాపూర్), బొల్లిపల్లి శ్రీనివాస్ (లింగాపూర్), అంగిడి సారయ్య( మెట్పల్లి), బొమ్మెన గట్టయ్య (మెట్పల్లి), దుబ్బాల సమ్మక్క ( మొలంగూర్) నియామకయ్యారు.

# బేబీ బంప్‌తో వర్కౌట్ చేస్తున్న సమంత



స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న తాజా ఫోటో డంప్‌లో వర్కౌట్ చేస్తున్న వీడియో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా వీడియోలో ఆమె లుక్‌పై నెట్టింట విస్తృతంగా చర్చ జరుగుతోంది. తాజా వీడియోలో సమంత జిమ్‌లో అప్పర్ బాడీ వ్యాయామాలు చేస్తూ కనిపించింది. ఫిట్‌నెస్‌కు ఎప్పుడూ ప్రాధాన్యం ఇచ్చే సమంత, కఠినమైన వ్యాయామాలను ఎంతో నిబద్ధతతో పూర్తి చేస్తున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ప్రతి సెట్ అనంతరం కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటూ మళ్లీ వ్యాయామం కొనసాగించింది. అయితే, ఈ వీడియో నేపథ్యంలో సోషల్ మీడియాలో సమంత వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక ఊహాగానాలు కూడా వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఆమె గర్భవతిగా ఉన్నారనే ప్రచారం కొద్ది రోజులుగా జరుగుతూ రాగా, దీనిపై సామ్ క్లారిటీ ఇచ్చింది. ఇటీవల మా ఇంటి బంగారం సక్సెస్ మీట్‌లో తాను ప్రగ్నెంట్ చెప్పుకొచ్చింది. అయితే ఫిట్‌నెస్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, గర్భధారణ సమయంలో వ్యాయామం చేయాలనుకునే వారు తప్పనిసరిగా వైద్యుల సూచనలు, పర్యవేక్షణలోనే తగిన వ్యాయామాలు చేయాలి. ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితి భిన్నంగా ఉండటంతో, ఒకరికి అనుకూలమైన వ్యాయామం మరొకరికి సరిపోవాల్సిన అవసరం లేదు. మరోవైపు, సమంత తన కెరీర్‌లో వరుస ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతోంది. నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగానూ కొత్త అడుగులు వేస్తూ విభిన్న కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంపై దృష్టి సారిస్తోంది. ప్రస్తుతం ఆమె పంచుకున్న ఫిట్‌నెస్ వీడియో మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది.

# ‘బ్లాస్ట్’ దర్శకుడితో సినిమా?



తమిళ యాక్షన్ థ్రిల్లర్ ‘బ్లాస్ట్’ చిత్రంతో తొలి ప్రయత్నంలోనే టాలెంటెడ్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు సుభాష్ కె రాజ్. అర్జున్, అభిరామి, ప్రీతి ముకుందన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించింది. ప్రస్తుతం ఓటీటీలో సైతం ఆదరణ చూరగొంటున్నది. దర్శకుడు సుభాష్ కె రాజ్ ఎంచుకున్న కాన్సెప్ట్, మేకింగ్‌స్టైల్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఈ యువ దర్శకుడితో హీరో నాని ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొస్తున్నాయి. ఇప్పటికే ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని, త్వరలో అధికారిక ప్రకటన రానుందని ఫిల్మ్‌నగర్ టాక్. ఇదిలావుండగా నాని తాజా చిత్రం ‘ది ప్యారడైజ్’ షూటింగ్ తుదిదశకు చేరుకుంది. ఆగస్ట్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత ఆయన సుజీత్ దర్శకత్వంలో ‘బ్లడీ రోమియో’ సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే.



# సుకుమార్ - దేవిశ్రీ ప్రసాద్ కాంబోకి బ్రేక్.. రామ్ చరణ్ సినిమా నుండి డీఎస్పీ ఔట్?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, క్రేజీ డైరెక్టర్ సుకుమార్ కలయికలో రూపుదిద్దుకోబోతున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్-ఇండియా చిత్రం ఎ=జ17 మ్యూజిక్ డైరెక్టర్ మార్పుకు సంబంధించి ఇండస్ట్రీలో ఒక సంచలన వార్త చక్కర్లు కొడుతోంది. ఈ భారీ ప్రాజెక్ట్ నుండి సుకుమార్ ఆస్థాన సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ తప్పుకున్నట్లు ఫిలిం నగర్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ ‘రంగస్థలం’ తర్వాత రాబోతున్న సినిమా కావడంతో, దేవిశ్రీ ఈ ప్రాజెక్ట్‌లో లేరనే ప్రచారం మెగా అభిమానులతో పాటు సినీ ప్రియులను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ షాకింగ్ మార్పు వెనుక ఇటీవల విడుదలైన ‘పుష్ప 2: ది రూల్’ చిత్రం సమయంలో తలెత్తిన కొన్ని క్రియేటివ్ డిఫరెన్సెస్ ఉన్నట్లు తెలుస్తోంది. పుష్ప 2 బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (దీ+వీ) మరియు రీ-రికార్డింగ్ పనులలో అనుకున్న సమయానికి అవుట్‌పుట్ రాకపోవడం, ఆ కారణంగా ఇతర మ్యూజిక్ డైరెక్టర్ల సేవలను సుకుమార్ ఉపయోగించుకోవాల్సి రావడం వంటి పరిణామాల వల్లే దేవిశ్రీతో సుకుమార్ బంధానికి బ్రేక్ పడిందని ఇండస్ట్రీ టాక్. ఈ క్రమంలోనే దేవిశ్రీ ప్రసాద్ స్థానంలో సరికొత్త సంగీతాన్ని అందించేందుకు బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ శాశ్వత్ సచ్‌దేవ్‌తో పాటు కోలీవుడ్ యంగ్ సెన్సేషన్స్ హర్షవర్ధన్ రామేశ్వర్ లేదా సాయి అభ్యంకర్ ల పేర్లను సుకుమార్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. 2024 హోలీ సందర్భంగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటించినప్పుడు పోస్టర్‌పై దేవిశ్రీ ప్రసాద్ పేరే ఉన్నప్పటికీ, తాజా మార్పులపై మైత్రీ మూవీ మేకర్స్ లేదా సుకుమార్ టీమ్ నుండి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం సుకుమార్ స్క్రిప్ట్ వర్క్‌ను పక్కాగా సిద్ధం చేసే పనిలో ఉండగా, రామ్ చరణ్ తన ప్రస్తుత చిత్రం ‘పెద్ది’ పూర్తయిన తర్వాత దసరా సీజన్ ముగిశాక ఈ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించే అవకాశం ఉంది, అప్పటివరకు ఈ మ్యూజిక్ డైరెక్టర్ సస్పెన్స్‌కు తెరపడకపోవచ్చు.

# మళ్లీ గ్యాప్ తీసుకుంటే మా ఇంటికొచ్చి కొట్టండి



అక్కినేని కుటుంబం నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చిన అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఇప్పటివరకు ఆశించిన స్థాయి విజయం అందుకోలేకపోయినా, కొత్త ఉత్సాహంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం లెనిన్ జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అఖిల్ తన కెరీర్, మూడు సంవత్సరాల విరామం, భవిష్యత్ ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మూడు సంవత్సరాలుగా తన నుంచి సినిమా రాకపోవడంతో అభిమానులు నిరాశ చెందారని అఖిల్ అన్నారు. ఇంత పెద్ద గ్యాప్ వచ్చినందుకు ముందుగా అభిమానులందరికీ క్షమాపణలు చెబుతున్నాను. కానీ ఇకపై సినిమాల మధ్య ఇంత విరామం ఉండదు. వరుసగా సినిమాలు చేస్తాను. ఒకవేళ మళ్లీ ఇంత సమయం తీసుకుంటే మా ఇంటికొచ్చి నన్ను కొట్టండి. ఆ బాధ్యతను నేనే తీసుకుంటున్నాను అంటూ ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. ‘లెనిన్’ విడుదలైన వెంటనే ఇప్పటికే విన్న పలు కథల్లో మంచి ప్రాజెక్టులను ఎంపిక చేసి బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేయనున్నట్లు వెల్లడించారు. గత చిత్రం ఏజెంట్ తర్వాత ఎందుకు కనిపించలేదన్న ప్రశ్నకు కూడా అఖిల్ సమాధానం ఇచ్చారు. సినిమా విడుదలైన మూడు నెలల తర్వాత ప్రమాదవశాత్తూ బాత్రూమ్‌లో జారి గాజు ముక్కలపై పడటంతో ఎడమ చేతికి తీవ్ర గాయమైందని తెలిపారు. ఆ ప్రమాదం కారణంగా రెండు శస్త్రచికిత్సలు చేయాల్సి వచ్చిందని, మొత్తం 48 కుట్లు పడ్డాయని చెప్పారు. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి దాదాపు 16 నెలలు పట్టిందని, అనంతరం సరైన కథ కోసం కూడా కొంత సమయం కేటాయించాల్సి వచ్చిందని వివరించారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ‘లెనిన్’ ట్రైలర్ విడుదల కార్యక్రమంలో కూడా అఖిల్ భావోద్వేగంగా మాట్లాడారు. ఈసారి నేను ఎక్కువగా మాట్లాడను. నా సినిమానే మాట్లాడుతుంది. గత కొద్ది రోజులుగా విశ్రాంతి లేకుండా పని చేస్తున్నా, అభిమానుల ప్రేమ, ఉత్సాహం నాకు కొత్త శక్తిని ఇచ్చాయి. ఈసారి నన్ను నమ్మండి అని ఆయన అన్నారు. దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ‘లెనిన్’లో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రాన్ని అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఈ చిత్రంతో అఖిల్ తన కెరీర్‌లో బలమైన విజయాన్ని అందుకోవాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com